



# మన దునియా

మన అక్షరం - మన ప్రపంచం

RNI Number TELTEL/2023/85680



రిపోర్టర్లు కావలెను

తెలుగులో రాయగల సమర్థత, సమాజం పట్ల అవగాహన ఉంటే చాలు.

మన దునియా

సంప్రదించు...

9490056011,9603969335



సంపుటి : 3 | సంచిక : 225 | ఫిబ్రవరి 1 మార్చ్ 2026 | పేజీలు : 8 | వెల రూ. 4.00/-


# ముఖ్యమంత్రి బేషరతుగా క్షమాపణ చెప్పాలి.. ఈటెల



- మిగిలిన ముప్పై ఎకరాల భూమి ఏమైంది?
- దానం చేసిన భూమిని లాక్కునే హక్కు ఎవరిచ్చారు?..
- కాంగ్రెస్ సర్కార్ కు ఈటల రాజేందర్ సూటి ప్రశ్న
- కూల్చివేతలకే పరిమితమైన రేవంత్ రెడ్డి పాలన..
- బాధితులకు బాసటగా నిలిచిన భారతీయ జనతా పార్టీ
- అంబేద్కర్ భవనంలో కన్నీటి ఘోష.. బాధితులకు స్వయంగా భోజనం వడ్డించిన ఈటల రాజేందర్.
- నియంతల కంటే దారుణమైన అహంకారం.. పేదల ఉసురుతో ప్రభుత్వ పతనం ఖాయం.
- మీడియా సమావేశంలో ఈటెల రాజేందర్ ఆగ్రహం.

**మన దునియా,ఖమ్మం:ఫిబ్రవరి 28**

ఖమ్మం : నిరుపేదలకు దానం చేసిన భూమిని దౌర్జన్యంగా లాక్కునే హక్కు కాంగ్రెస్ పాలకులకు ఎవరిచ్చారు?.. కనీస కనికరం లేకుండా నిద్రమత్తులో ఉన్న అభాగ్యుల ఆవాసాలను నేలమట్టం చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి తక్షణమే బేషరతుగా క్షమాపణ చెప్పాలి..అరవై రెండు ఎకరాల భూదాన్ భూమిలో ముప్పై రెండు ఎకరాల్లో పేదలు తలదాచుకుంటుంటే అమానుషంగా లాక్కున్న అధికార పక్షం, మిగతా ముప్పై ఎకరాల భూమిని ఏ బడాబాబులకు కట్టబెట్టిందో, ఆ భూమి ఏమైందో తక్షణమే లెక్క చెప్పాలి" అంటూ భారతీయ జనతా పార్టీ జాతీయ నాయకుడు ఈటల రాజేందర్ రాష్ట్ర ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. శనివారం ఆయన ఖమ్మం నగరంలోని అంబేద్కర్ భవనంలో తలదాచుకుంటున్న భూదాన్ బాధితులను పరామర్శించి వారికి అండగా ఉంటామని భరోసా కల్పించారు. నిలువనీడ కోల్పోయి ఆకలితో అలమటిస్తున్న బాధితులకు భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో భోజన సదుపాయం ఏర్పాటు చేశారు. ఈటల రాజేందర్ స్వయంగా అభాగ్యులకు భోజనం వడ్డించి వారి కన్నీళ్లు తుడిచారు. ఈ కష్టకాలంలో పేదల



## రేవంత్ వర్సెస్ జంపింగ్స్ బీఆర్ఎస్ గట్టి వ్యూహం..!

**మన దునియా,హైదరాబాద్: ఫిబ్రవరి 28**




ఒకే దెబ్బకు రెండు పిట్టలు అన్నట్టుగా. తెలంగాణ ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నట్టు రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది. ప్రస్తుతం రెండు రాజ్యసభ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. దీనికి సంబంధించిన నోటిఫికేషన్ వచ్చేసింది. మరో వారం రోజుల్లో నామినేషన్లకు కూడా గడువు ముగియనుంది. ఈ క్రమంలో రెండు విధానాల ద్వారా. బీఆర్ఎస్ పార్టీ. అధికార పార్టీ కాంగ్రెస్‌ను ఇరుకున పెట్టే ప్రయత్నం చేయనుందని తెలుస్తోంది.


(మిగతా 2వ పేజీలో..)


## ఇరాన్ పై ఇజ్రాయెల్ దాడి.. భారీ పేలుళ్లతో దద్దరిల్లిన టెహ్రాన్..

- సుప్రీం లీడర్ ఖమేనీ కార్యాలయం సమీపంలోనే క్షిపణి దాడులు!
- వీధులను కమ్మేసిన దట్టమైన పొగ
- ప్రాణభయంతో రోడ్లపైకి పరుగులు తీసిన జనం



## జలమండలికి శారదా పీఠం భూముల కేటాయింపు... సీఎం రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు

- పీఠానికి కేటాయించిన భూముల్లో జలమండలి నిర్మాణ పనులు చేపట్టవద్దని ఆదేశం
- జలమండలికి పీఠం భూముల కేటాయింపు తక్షణమే రద్దు చేయాలన్న ముఖ్యమంత్రి
- జలమండలి నిర్మాణ పనులపై ముఖ్యమంత్రి అసహనం




2


## జమ్మూకశ్మీర్ రంజీ విజయంపై ప్రధాని మోదీ ప్రశంసలు

- తొలిసారి రంజీ ట్రోఫీ గెలుచుకుని చరిత్ర సృష్టించిన జమ్మూకశ్మీర్
- జట్టు పట్టుదల క్రమశిక్షణ అద్భుతమన్న ప్రధాని మోదీ
- తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం ఆధారంగా కర్ణాటకపై విజయం
- శుభమ్ పుండిర్ ఆకిబ్ నబీ దార్ అద్భుత ప్రదర్శన






2

మన దునియా
మన అక్షరం - మన ప్రపంచం

# ముఖ్యమంత్రి బేషరతుగా క్షమాపణ చెప్పాలి.. ఈటెల





(మొదటి పేజీ తరువాయి)

పక్షాన భారతీయ జనతా పార్టీ నిరంతరం అండగా నిలుస్తుందని వారికి హామీ ఇచ్చారు. అనంతరం విలేకరుల సమావేశంలో ఈటల రాజేందర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ తీరును తీవ్రంగా ఎండగట్టారు. గత ఐదు రోజులుగా వెలుగుమట్ల ప్రాంతంలో అమాయక ప్రజల కన్నీళ్లతో కాంగ్రెస్ ప్రభుత్వం చెలగాటం ఆడుతోందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.కళ్లెదుటే గుడిసెలు కూలిపోయి బతుకులు రోడ్డున పడటంతో ఈ ప్రభుత్వం సర్వనాశనం కావాలని బాధితులు శాపనార్థాలు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఖమ్మం జిల్లాలో ఒక్క స్థానం మినహా అన్ని స్థానాలను అధికార పక్షానికే కట్టబెట్టారని, కీలక మంత్రి పదవులు కూడా ఈ జిల్లాకే దక్కాయని గుర్తుచేశారు.పలువురు మంత్రులు ఉన్నా తమకు న్యాయం జరుగుతుందని జనం ఎంతో సంబురపడ్డారని, కానీ అధికారంలోకి వచ్చిన వెంటనే దారుణంగా తమ ఇళ్లనే కూల్చివేస్తారని నిరుపేదలు ఏనాడూ ఊహించలేదని విమర్శించారు. మొదట్నుంచీ కాంగ్రెస్ దమననీతినే కొనసాగిస్తోందని మండిపడ్డారు.భూదాన్ భూమి అంటేనే నిరుపేదలకు దానం చేసిన భూమి అని పాలకులకు కనీస స్పృహ లేదా అని ఈటల రాజేందర్ నిలదీశారు. మహానుభావుడు వినోబా భావే వేలాది ఎకరాలను దానం చేశారని అందులో భాగంగానే సర్వే సంఖ్య నూట నలభై ఏడు, నూట నలభై ఎనిమిది, నూట నలభై తొమ్మిదిలలో అరవై రెండు ఎకరాల భూదాన్ భూమి ఉందని ఆయన స్పష్టం చేశారు.ఆనాడు ఈ భూములను ఎవరూ పట్టించుకోలేదని కానీ నేడు ఆ ప్రాంతంలో భూముల ధరలు విపరీతంగా పెరగడంతో బడాబాబుల కన్ను అటు వైపు పడిందని ఆరోపించారు. ప్రస్తుత రాష్ట్ర ముఖ్యమంత్రి పాలన కేవలం కూల్చివేతలకే పరిమితమైందని ధ్వజమెత్తారు. నిరుపేదలకు భూములు పంచడం చేతకాని ఈ ప్రభుత్వానికి ఉన్న భూములను కబ్జా చేయడం లాక్కోవడం మాత్రమే తెలుసునని తీవ్రంగా విమర్శించారు.రెండు వేల పంతొమ్మిదిలోనే న్యాయమూర్తి చల్లా కోదండరాం ఈ పేదలకు విద్యుత్తు నీళ్లు ఇవ్వాలని ఆదేశించినా ఆనాటి ప్రభుత్వం పట్టించుకోలేదని, ఈనాటి ప్రభుత్వం ఆ కనీస వసతులు కల్పించకపోగా దౌర్జన్యంగా ఉన్న ఇళ్లను కూడా లాక్కుందని మండిపడ్డారు.ఏ న్యాయస్థానం ఇళ్లు కూల్చమని ఆదేశాలు ఇచ్చిందని రక్షక భటులతో వెళ్లి బలవంతంగా ఇళ్లు లాక్కున్నారని ఆయన ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించారు. పేదల గుడిసెలు కూల్చిన పాలకులకు కబ్జా చేసిన బడాబాబుల వద్ద ఉన్న వందలాది ఎకరాల భూములు వెనక్కి తీసుకునే దమ్ము ఉందా అని సవాల్ విసిరారు.పెద్దల జోలికి వెళ్లే ధైర్యం లేకనే ఏ దిక్కూ లేని అభాగ్యులపై ప్రతాపం చూపుతున్నారని దుయ్యబట్టారు. అరవై రెండు ఎకరాల భూమిలో ముప్పై రెండు ఎకరాల్లో పేదలు తలదాచుకుంటుంటే దాన్ని అమానుషంగా లాక్కున్నారని, మిగతా ముప్పై ఎకరాలు ఎవరి చేతుల్లో ఉన్నాయో ఆ భూమి ఏమైందో చెప్పాలని నిలదీశారు.ఆ ముప్పై ఎకరాల భూమి లెక్క జిల్లా పాలనాధికారి చెప్పగలరా అని ఆయన ప్రశ్నించారు. ఈ ప్రభుత్వం పేదల కళ్లలో మట్టి కొట్టిన అత్యంత దుర్మార్గపు ప్రభుత్వమని విమర్శించారు.జిల్లాలో ఉన్న భూదాన్ భూముల వివరాలు మొత్తం వెంటనే బహిర్గతం చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.కనీస కనికరం లేకుండా పేదల ఆవాసాలను కూల్చివేసి తప్పు జరిగినందుకు ముఖ్యమంత్రి బేషరతుగా బాధితులకు క్షమాపణ చెప్పాలని ఈటల రాజేందర్ డిమాండ్ చేశారు. పేదలు ఓట్లు వేస్తే గద్దెనెక్కిన ఈ పార్టీ పేరుకు మాత్రమే పేదల పార్టీ అని చేతల్లో మాత్రం రాక్షస పార్టీ అని విమర్శించారు.తక్షణమే ప్రభుత్వం స్పందించి బాధితులకు సత్వర న్యాయం చేయాలని, కూల్చిన చోటే ఇళ్లు కట్టించి ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రజల ఆగ్రహ జ్వాలల్లో ఈ ప్రభుత్వం మాడిమస్సైపోవడం ఖాయమని తీవ్ర స్థాయిలో హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ ఖమ్మం జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు , భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కోశాధికారి దేవకి వాసుదేవరావు, గల్లా సత్యనారాయణ , నాయకులు శీలం పాపారావు, దొంగల సత్యనారాయణ, మందడపు సుబ్బారావు, గుత్తా వెంకటేశ్వర్లు, వీరవల్లి రాజేష్, బండారు నరేష్, నున్న రవికుమార్, విజయరాజు, కుమిలి శ్రీనివాస్, రవి రాథోడ్, శ్యామ్ రాథోడ్, ఏలూరి నాగేశ్వరరావు, కందుల శ్రీకృష్ణ, మందా సరస్వతి,మనీ , నకిరేకంటి వీరభద్రం, తదితరులు పాల్గొన్నారు.

## జమ్మూకశ్మీర్ రంజీ విజయంపై ప్రధాని మోదీ ప్రశంసలు

జమ్మూకశ్మీర్ క్రికెట్ జట్టు తొలిసారి రంజీ ట్రోఫీ టైటిల్‌ను కైవసం చేసుకుని చరిత్ర సృష్టించింది. రంజీ ట్రోఫీ 2025–26 సీజన్ విజేతగా నిలిచిన జమ్మూకశ్మీర్ జట్టుపై ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రశంసల వర్షం కురిపించారు. ఈ విజయం ఆ ప్రాంత ప్రజలకు గర్వకారణమని, జట్టు పట్టుదల, క్రమశిక్షణ, క్రీడాస్ఫూర్తికి ఇది నిదర్శనమని ప్రధాని పేర్కొన్నారు.ప్రధాని మోదీ ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. "తొలిసారి రంజీ ట్రోఫీ గెలుచుకున్న జమ్మూకశ్మీర్ జట్టుకు అభినందనలు. ఈ చారిత్రక విజయం అక్కడ పెరుగుతున్న క్రీడా ప్రతిభను చాటిచెబుతోంది. ఈ గెలుపు ఎందరో యువ క్రీడాకారులకు స్ఫూర్తిగా నిలుస్తుందని ఆశిస్తున్నాను" అని తెలిపారు. హుబ్లీ క్రికెట్ మైదానంలో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో ఎనిమిది సార్లు ఛాంపియన్‌గా నిలిచిన బలమైన కర్ణాటక జట్టుపై జమ్మూకశ్మీర్ పైచేయి సాధించింది. 67 ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణ తర్వాత దేశవాళీ క్రికెట్‌లో జమ్మూకశ్మీర్ ఈ ప్రతిష్ఠాత్మక టైటిల్‌ను సొంతం చేసుకుంది. తొలి ఇన్నింగ్స్‌లో శుభమ్ పుండిర్ సెంచరీతో రాణించడంతో జమ్మూకశ్మీర్ 584 పరుగుల భారీ స్కోరు సాధించింది. బౌలింగ్‌లో ఆకిబ్ నబీ దార్ 5 వికెట్లు పడగొట్టడంతో కర్ణాటక 293 పరుగులకే ఆలౌట్ అయ్యింది. రెండో ఇన్నింగ్స్‌లోనూ జమ్మూకశ్మీర్ బ్యాటర్లు కమ్రాన్ ఇక్బాల్ (160), సాహిల్ లోత్రా సెంచరీలతో చెలరేగారు. జట్టు స్కోరు 342/4 వద్ద ఉన్నప్పుడు కెప్టెన్ పరాస్ డోగ్రా ఇన్నింగ్స్ డిక్లేర్ చేశారు. మ్యాచ్ డ్రాగా ముగిసినప్పటికీ, భారీ తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం ఆధారంగా జమ్మూకశ్మీర్ విజేతగా నిలిచింది.

## జలమండలికి శారదా పీఠం భూముల కేటాయింపు... సీఎం రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు




కోకాపేటలోని శారదా పీఠానికి కేటాయించిన భూమికి సంబంధించి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు జారీ చేశారు. శారదా పీఠానికి కేటాయించిన ఈ భూముల్లో జలమండలి నిర్మాణ పనులు చేపట్టవద్దని ఆదేశించారు. జలమండలికి శారదా పీఠం భూముల కేటాయింపు తక్షణమే రద్దు చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. శారదా పీఠం భూములను జలమండలికి కేటాయించడంతో అక్కడ నిర్మాణ పనులు చేపట్టారు. జలమండలి నిర్మాణ పనులను శారదా పీఠం ప్రతినిధులు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకురాగా, అధికారులపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. పీఠం భూములను జలమండలికి కేటాయించిన సమయంలో అక్కడి నిర్మాణాల స్థితిని తెలియజేయకపోవడాన్ని ప్రశ్నించారు. జలమండలికి ఈ భూకేటాయింపులను రద్దు చేసి, శారదా పీఠానికే ఆ భూములు కొనసాగేలా ఆదేశించారు.

## ఇరాన్ పై ఇజ్రాయెల్ దాడి.. భారీ పేలుళ్లతో దద్దరిల్లిన టెహ్రాన్..

ఇరాన్–ఇజ్రాయెల్ మధ్య కొనసాగుతున్న ఉద్రిక్తతలు శనివారం నాటికి పరాకాష్ఠకు చేరాయి. ఇరాన్ రాజధాని టెహ్రాన్ పై ఇజ్రాయెల్ వాయుసేన 'ముందస్తు దాడులు' చేసింది. దీంతో నగరం అతలాకుతలమైంది. వరుస పేలుళ్ల ధాటికి టెహ్రాన్ వీధులు దట్టమైన నల్లటి పొగతో నిండిపోయాయి. అంతర్జాతీయ మీడియా నివేదికల ప్రకారం.. ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ కార్యాలయానికి సమీపంలోనే ఈ పేలుళు సంభవించినట్లు తెలుస్తోంది. నగరవ్యాప్తంగా భారీ శబ్దాలు వినిపించడంతో ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. ఏం జరుగుతోందో తెలియక జనం తమ వాహనాల్లో ఇళ్లు వదిలి సురక్షిత ప్రాంతాలకు పరుగులు తీస్తున్న దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి.

యుద్ధం ముంగిట రెండు దేశాలు

ఈ దాడులతో పశ్చిమాసియాలో యుద్ధం మరింత ముదిరే అవకాశం కనిపిస్తోంది. ఇజ్రాయెల్ దాడులకు ప్రతిస్పందనగా ఇరాన్ ఎలాంటి చర్యలు తీసుకుంటుందోనని ప్రపంచ దేశాలు ఉత్కంఠగా గమనిస్తున్నాయి. ఇప్పటికే అమెరికా సహా పలు దేశాలు సంయమనం పాటించాలని కోరుతున్నప్పటికీ, ఇరు దేశాల మధ్య ఘర్షణ సద్దుమణిగేలా కనిపించడం లేదు. టెహ్రాన్‌లో ప్రస్తుతం అప్రకటిత ఎమర్జెన్సీ వాతావరణం నెలకొంది.



# రేవంత్ వర్సెస్ జంపింగ్స్ బీఆర్ఎస్ గట్టి వ్యూహం..!

1) విప్ జారీ చేయడం: ప్రస్తుతం భర్తీ అయ్యే రెండు రాజ్యసభ స్థానాలు కూడా ఎమ్మెల్యేల ఓటు తోనే భర్తీ అవుతున్నాయి. రహస్య బ్యాలెట్ ఓటు ద్వారా రాజ్యసభ అభ్యర్థులను ఎన్నుకుంటారు. అయితే.. ఈ క్రమంలో సభలో ప్రాతినిధ్యం వహిస్తున్న పార్టీలు విప్ జారీ చేసే అవకాశం ఉంది. అంటే.. తమ ఎమ్మెల్యేలు ఖచ్చితంగా వీరికే ఓటు వేయాలని తేల్చి చెప్పవచ్చు. బీఆర్ఎస్ దీనిని వినియోగించుకోవడం ద్వారా జంపింగ్ ఎమ్మెల్యేలు పది మందిని ఇరకాటంలోకి నెట్టే అవకాశం ఉంటుంది.వారు వేసే ఓటు ఎవరికి అనేది బీఆర్ఎస్‌కు తెలిసిపోతుంది. తద్వారా. విప్‌ను ఉల్లంఘిస్తే. దీనిపై ఫిర్యాదు చేసి చట్టపరంగా పది మంది ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకునే అవకాశం ఉంది. ఒకవేళ.. చట్టపరమైన చర్యలు ఆలస్యమైతే. సదరు పది మందిపై రాజకీయంగా ప్రజల్లో పలుచన చేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టే అవకాశం కూడా బీఆర్ఎస్‌కు దక్కనుంది. సో. మొత్తంగా ఈ వ్యూహాన్ని అమలు చేయడం ద్వారా ఆ పది మందిని తన దారికి తెచ్చుకునే ప్రయత్నంలో బీఆర్ఎస్ ఉంది.

2) బీఆర్ఎస్ తరఫున అభ్యర్థి: వాస్తవానికి అసెంబ్లీ బలాబలాలను చూసుకుంటే. బీఆర్ ఎస్‌కు పెద్దగా బలం లేదు. మొత్తం 119 ఎమ్మెల్యేల్లో 63 మంది నేరుగా కాంగ్రెస్‌కు ఉన్నారు. మరో పది మంది బీఆర్ ఎస్ తరఫున గెలిచి కూడా కాంగ్రెస్‌కుమద్దతు ప్రకటించారు. సో. మొత్తంగా 73 మంది కాంగ్రెస్‌కు ఉన్నారు. కానీ, ఇప్పుడుబీఆర్ ఎస్ తన అభ్యర్థిని ప్రకటిస్తే. ఒక్కొక్క అభ్యర్థికి నిర్దిష్టంగా 40 మంది




ఎమ్మెల్యేల మద్దతు అవసరం ఉంటుంది. ఈ క్రమంలో కాంగ్రెస్‌లో అసంతృప్తులు కానీ, ఎంఐఎం అభ్యర్థులు కానీ. తమతో కలిసి వచ్చే అవకాశం ఉంటుందనరు అంచనా వేస్తున్నారు. దీనిని ఎదుర్కొనేందుకు సీఎం రేవంత్ రెడ్డి తీవ్రంగా కష్టపడాలి. లేకపోతే. బీఆర్ ఎస్ విన్నయినా. ఆశ్చర్యపోవాల్సిన అవసరం ఉండదని పరిశీలకులు చెబుతున్నారు. మరి ఏం జరుగుతుందో చూడాలి.

మన దునియా
మన అక్షరం – మన ప్రపంచం



# ఇరాన్‌పై సైనిక చర్యను ప్రారంభించాము.. మా లక్ష్యం అదే: డొనాల్డ్ ట్రంప్

మన దునియా,ఇంటర్నెట్ డెస్క్: ఫిబ్రవరి 28




ఇరాన్‌పై ఇజ్రాయెల్ శనివారం క్షిపణి దాడులు ప్రారంభించిన వేళ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాజాగా కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ దాడుల్లో తామూ పాల్గొంటున్నట్టు ధ్రువీకరించారు. ఇజ్రాయెల్‌తో కలిసి సంయుక్తంగా సైనిక చర్యను ప్రారంభించామని అన్నారు. ఇరాన్ పాలకులతో ఎదురవుతున్న ముప్పును తప్పించడమే తమ లక్ష్యమని అన్నారు. ఎక్స్ వేదికగా ఓ వీడియోను షేర్ చేస్తూ ఇరాన్ సైన్యానికి కీలక హెచ్చరికలు చేశారు. ఇరాన్ సైన్యంతో పాటు పోలీసులు, ఇతర సాయుధ దళాలు తమ ఆయుధాలను త్యజించాలని స్పష్టం చేశారు. చెప్పినట్టు చేస్తే తాము మానవత్వంతో నడుచుకుంటామని అన్నారు. లేని పక్షంలో మరణం తప్పదని హెచ్చరించారు. ఇరాన్‌లోని పాలనను హస్తగతం చేసుకోవాలని ప్రజలకూ పిలుపునిచ్చారు. స్వేచ్ఛావాయులు పీల్చుకునే అవకాశం వారి ముందు ఉందని కామెంట్ చేశారు. ప్రపంచవ్యాప్తంగా ఉగ్రవాదాన్ని ఇరాన్ ఎగదోస్తోందని ట్రంప్ మండిపడ్డారు. తమ పౌరులను ఇటీవలే వేల సంఖ్యలో ఇరాన్ పాలక వర్గం అంతమొందించిందని అన్నారు. ఉగ్రవాద పాలకుల చేతికి అణ్వాయుధం చిక్కకూడదన్నదే అమెరికా విధానమని స్పష్టం చేశారు. వాళ్లకు ఎప్పటికీ అణ్వాయుధాలు దక్కనీయనని స్పష్టం చేశారు. అణ్వాయుధాలు సమకూర్చుకునేందుకు ప్రయత్నించొద్దని గతంలో ఇరాన్‌కు పదే పదే చెప్పామని గుర్తు చేశారు. ఈ విషయంలో ఒప్పందం కుదుర్చుకునేందుకూ ప్రయత్నించామని గుర్తు చేశారు. ఇరాన్ తన అణులక్ష్యాలను వదులుకునేందుకు నిరాకరించిందని అన్నారు. అణు కార్యక్రమాన్ని పునర్ నిర్మించేందుకు, దీర్ఘ శ్రేణి మిసైల్స్‌ను సమకూర్చుకునేందుకు రంగంలోకి దిగిందని అన్నారు. ఐరోపా దేశాలు, ఆ ప్రాంతంలోని అమెరికా సైన్యంతో పాటు అమెరికా ప్రధాన భూభాగంలోని వారికి కూడా ముప్పుగా మారిందని మండిపడ్డారు. ఇక ఈ సైనిక చర్యలో భాగంగా అమెరికా సిబ్బందికి ఉన్న రిస్క్‌ను తగ్గించేందుకు అన్ని చర్యలూ తీసుకున్నామని అన్నారు. ఈ ఆపరేషన్ కొన్ని రోజుల పాటు సాగే అవకాశం కూడా ఉందని అన్నారు..

# ముదిరాజుల పైన వివక్ష చూపుతున్న రేవంత్ రెడ్డి!

**ముదిరాజులను బి.సి "ఏ" లో చేర్చుతానని కాంగ్రెస్ మేనిపిస్టో పెట్టింది ఉత్తదేన!**

**జంగిటి శ్రీనివాస్ ముదిరాజ్**

**ముదిరాజ్ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు**

మన దునియా సిద్ధిపేట జిల్లా: ఫిబ్రవరి 28



ముదిరాజులను బిసి ఏలోకి మారుస్తానని కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో పొందుపరిచి ముదిరాజ్ ఓట్లతో గద్దెనెక్కిన రేవంత్ రెడ్డి ముదిరాజులు నట్టేట ముంచిండని ముదిరాజ్ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు జంగిటి శ్రీనివాస్ ముదిరాజ్ మండిపడ్డారు. శనివారం రోజు జిల్లా అధ్యక్షులు యమ ధర్మ ముదిరాజ్ తో కలిసి జంగిటి శ్రీనివాస్ ముదిరాజ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయి రెండు సంవత్సరాలు గడిచిపోయిన ముదిరాజుల బీసీఏ అంశాన్ని పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాడని అన్నారు. ఎన్నికల సమయంలో బిసి డిక్లరేషన్ సభ కామారెడ్డిలో నిర్వహించినప్పుడు ముదిరాజుల ప్రధాన డిమాండ్ అయిన బీసీఏ అంశాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే పరిష్కరిస్తామని కాంగ్రెస్ మేనిఫెస్టోలో పొందుపరిచి హామీ ఇచ్చి ముదిరాజులను నమ్మించి ఓట్లు వేసుకొని ముఖ్యమంత్రి అయినాక నిర్లక్ష్య ధోరణితో ముదిరాజులను ఏ మాత్రం పట్టించుకోకుండా ముదిరాజ్ జాతిని నిండా ముంచడమే కాకుండా ముదిరాజ్ ఆత్మగౌరవాన్ని దెబ్బతీశాడని అన్నారు తరాలు మారుతున్న ముదిరాజ్ తల రాతలు మారడం లేదని ముదిరాజుల హక్కులు దక్కాలంటే తెలంగాణ రాష్ట్రంలోని యావత్ ముదిరాజులంతా ఏకమై ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం మీద రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీ మీద పోరాటం చేయడానికి సిద్ధమై రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని ఎండగట్టాలని వచ్చే స్థానిక ఎన్నికలలో ఎన్నికలలో ముదిరాజ్ సత్తా చాటాలని కాంగ్రెస్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని కాంగ్రెస్ అభ్యర్థులను చిత్తుగా ఓడియ్యడానికి ప్రతి ఒక్కరు సిద్ధమై రేవంత్ రెడ్డికి గుణపాఠం నేర్పాలని సూచిస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటికైనా ముదిరాజుల పట్ల ఆలోచించి జీవో నెంబర్ 15 పునరుద్ధరణ చేసి ముదిరాజ్ బీసీ ఏ లో చేర్చాలని డిమాండ్ చేశారు. జంగిటి శ్రీనివాస్ ముదిరాజ్, యామ ధర్మ, సందెబోయిన సతీష్, పరకపెల్లి యాదయ్యా లు ఉన్నారు.

# అర్ధరాత్రి ఆస్పత్రిలో మాస్క్‌తో తచ్చాడిన ఓ మహిళ..

**ఎవరా అని ఆరా తీయగా...**

**ఆ మహిళ మాస్క్ పెట్టుకుంది. అర్ధరాత్రి ఆస్పత్రిలో తచ్చాడుతూ కనిపించింది**

**కట్ చేస్తే..!**

**అక్కడున్న వార్డు బాయ్స్.. బయటకు వెళ్లమ్మా అని అన్నారు**

**ఆమె మాస్క్ తీయగానే దెబ్బకు షాక్ అయ్యి.. పరుగులు పెట్టారు**

**ఇంతకీ ఆమె ఎవరంటే.?**

మన దునియా,గుంటూరు జిల్లా: ఫిబ్రవరి 28

రాత్రి పదకొండు గంటల తర్వాత ముఖానికి మాస్క్ పెట్టుకొని ఒక మహిళ గుంటూరు జనరల్ ఆసుపత్రిలోని ఎమర్జెన్సీ వార్డుకు వచ్చింది. అక్కడున్న రోగులతో మాట్లాడుతుంది. ఈ విషయాన్ని గమనించి స్థానిక సిబ్బంది బయటకు వెళ్లాలంటూ ఆ మహిళకు సూచించారు. అయితే ఆమె మాత్రం వార్డులన్నీ తిరుగుతూ రోగులను పలకరిస్తూ వివరాలు సేకరించడం మొదలు పెట్టింది. దీంతో సిబ్బంది ఆమె ఎవరా అంటూ ఆరా తీయడం మొదలు పెట్టారు. కొద్దిసేపటికే ఆమె గుంటూరు జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా అని అర్థమైపోయింది. దీంతో సిబ్బంది ఉరుకులు పరుగులు పెట్టారు.జీజీహెచ్‌లో గత కొంతకాలంగా రోగులకు అందుతున్న వైద్య సేవలపై పలు ఆరోపణలు వస్తున్నాయి. వైద్యులు అందుబాటులో ఉండటం లేదని ముఖ్యంగా రాత్రి వేళల్లో రోగులు ఇబ్బందులు పడుతున్నారన్న విమర్శలు వస్తున్నాయి. ఈ క్రమంలో జీజీహెచ్ సూపరింటెండెంట్ రమణ యశస్వి, వైద్య ఆరోగ్య శాఖ సెక్రటరీ సౌరభ్ గౌర్ జీజీహెచ్‌లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలోనే గుంటూరు జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా కూడా రాత్రి పదకొండు గంటల తర్వాత జీజీహెచ్‌కి సాధారణ రోగి బంధువులాగా వెళ్లి వివరాలు సేకరించారు. కొంతమంది రోగి బంధువులు కింద పడుకుని ఉండటాన్ని గమనించిన ఆమె రోగుల విశ్రాంతి భవనానికి వెళ్లాలంటూ సూచించారు. అదే విధంగా చికిత్స అందుతున్న విధానం గురించి రోగులను, రోగి బంధువులను అడిగి తెలుసుకున్నారు. దాదాపు గంటకుపైగానే ఆమె జీజీహెచ్ వివిధ విభాగాలను పరిశీలించారు.కలెక్టర్ అర్ధరాత్రి సమయంలో జీజీహెచ్‌కు వచ్చిన విషయం తెలిసి సిబ్బంది అప్రమత్తమయ్యారు. ముఖ్యంగా వివిధ వార్డుల్లో ఉన్న వాస్తవ పరిస్థితిని, రోగులు, వారి బంధువుల అభిప్రాయాలను తెలుసుకునేందుకే కలెక్టర్ రాత్రి వేళ్లలో పర్యటించినట్లు భావిస్తున్నారు. ఏది ఏమైనా ముఖ్యమైన అధికారులంతా జిజిహెచ్ పై దృష్టి పెట్టడంతో మెరుగైన వైద్య సేవలు అందుతాయన్న భావన రోగుల్లో వ్యక్తం అవుతోంది. అయితే నిర్లక్ష్యంగా ఉన్న సిబ్బందిపై చర్యలు తీసుకుంటేనే మరింతగా మార్పు వస్తుందన్న అభిప్రాయాలు జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న రోగి బంధవుల నుంచి వస్తున్నాయి.



# పార్కింగ్ స్థలం కు అడ్డంగా శ్రీ లక్ష్మి బిగ్ మార్ట్ బోర్డు

**ప్రమాదాలకు నిలయంగా మారిన సూపర్ మార్కెట్ బోర్డు**

**పార్కింగ్ కు అడ్డంగా ఉన్న బోర్డును తొలగించాలని విజ్ఞప్తి**



మన దునియా,జోగులాంబ గద్వాల జిల్లా:ఫిబ్రవరి 28

జోగులాంబ గద్వాల జిల్లా:

గద్వాల పాత బస్టాండు లో శ్రీలక్ష్మి బిగ్ సూపర్ మార్కెట్ ముందు పార్కింగ్ కు అడ్డంగా వాహనాలకు అడ్డంగా శ్రీలక్ష్మి బిగ్ సూపర్ మార్కెట్ బోర్డును ఏర్పాటు చేయడం జరిగింది. అయితే ఈ బోర్డు వల్ల అనేక ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని వాహనాలు ఆపే చోట పార్కింగ్ కు అడ్డంగా ఉండడం, రోడ్డు పక్కల నుంచి వాహనాలు వెళ్లేందుకు ఇబ్బందిగా ఉన్న స్థలంలో బోర్డును ఏర్పాటు చేయడం వల్ల వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అక్కడ 10 గ్రామాల ప్రజలు ప్రయాణికులు వెయిట్ చేసే స్థలంలో రోడ్డు కు బోర్డు పాతడం చాలా విడ్డూరం. మున్సిపాలిటీ కమిషనర్ మరియు మునిసిపాలిటీ చైర్పర్సన్ తుమ్మల జయలక్ష్మి గారు అలాగే ట్రాఫిక్ ఎస్ఐ బాలచంద్రుడు స్పందించి ప్రమాదాలకు చోటు చేసుకోకుండగా అధికారులు గమనించి అట్టి బోర్డును వేరే చోట ఏర్పాటు చేసుకునే విధంగా చర్యలు చేపట్టాలని వాహనదారులు సోషల్ మీడియా ద్వారా తెలియపరిచారు.

# వేట్లపాలెంలో భారీ పేలుడు.. 18 మంది మృతి




మన దునియా,కాకినాడ:ఫిబ్రవరి 28

సామర్లకోట మండలం వేట్లపాలెంలోని బాణసంచా తయారీ కేంద్రంలో శనివారం భారీ పేలుడు సంభవించింది. ఈ ఘటనలో 18 మంది మృతి చెందారు. టపాసులు తయారు చేస్తుండగా ఒక్కసారిగా పేలుడు సంభవించినట్లు సమాచారం. పేలుడు ధాటికి మృతదేహాలు చెల్లాచెదురుగా పడ్డాయి. అలాగే ఈ ప్రమాదంలో అనేమంది కార్మికులకు తీవ్ర గాయాలు అయ్యాయి. పేలుడు సమయంలో మొత్తం 30 మంది కార్మికులు ఉన్నట్లు తెలుస్తోంది. భారీగా మంటలు ఎగిసిపడుతున్నాయి. పేలుడుతో ఆ ప్రాంతమంతా దట్టమైన పొగ అలముకుంది.సమాచారం అందిన వెంటనే అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకుని మంటలను అదుపు చేసేందుకు యత్నిస్తున్నారు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు సమాచారం. మృతుల్లో ఎక్కువమంది మహిళలు ఉన్నారు. పేలుడు శబ్ధం విని స్థానికులు భారీగా అక్కడకు చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఘటనాస్థలిలో మృతుల బంధువుల ఆర్తనాదాలు మిన్నంటాయి..


# ఆన్ లైన్ గేమ్స్ ఆడొద్దు అన్న పాపానికి ...కన్న తల్లి తండ్రి ని చంపి...తాను ఆత్మహత్య చేసుకున్నాడు!

**ఆన్‌లైన్ గేమ్స్ విషయంలో మందలించడమే కారణం**

**హత్య అనంతరం ఆన్‌లైన్‌లో ఫుడ్ ఆర్డర్**

**తిన్నాక భవనం పైనుంచి దూకి ఆత్మహత్య**

మన దునియా,తూర్పుగోదావరి జిల్లా:ఫిబ్రవరి 28



తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరానికి చెందిన గాలి రవి (49), శ్రీదేవి (43) దంపతులు రియాద్‌లోని హరా ప్రాంతంలో నివసిస్తున్నారు. వీరి ఒక్కగానొక్క కుమారుడు యెబ్ర ప్రభాకర్ స్థానిక భారతీయ పాఠశాలలో ప్లస్ 2 చదువుతున్నాడు. ఆన్‌లైన్ గేమ్‌లకు బానిసైన ప్రభాకర్‌తో తల్లిదండ్రులకు తరచూ గొడవలు జరుగుతున్నాయి. చదువును నిర్లక్ష్యం చేస్తున్నాడని వారు మందలిస్తూ వచ్చారు. గురువారం రాత్రి ఇదే విషయమై మరోసారి మందలించడంతో ఆగ్రహంతో ఊగిపోయిన ప్రభాకర్, విచక్షణ కోల్పోయి తల్లిదండ్రులను కత్తితో పొడిచి చంపేశాడు. అనంతరం ఆన్‌లైన్‌లో ఫుడ్ ఆర్డర్ చేసి తిన్నాడు. కొంతసేపటికి తాను నివసిస్తున్న భవనంపై నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. రవి ఓ బ్యాంకులో, శ్రీదేవి ఓ పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తూ అందరితో స్నేహంగా ఉండేవారని స్థానిక ప్రవాసీయులు గుర్తు చేసుకున్నారు. కన్నకొడుకు చేతిలోనే ఇంత దారుణంగా చనిపోవడం జీర్ణించుకోలేకపోతున్నామని కన్నీటిపర్యంతమయ్యారు.

మన దునియా
మన అక్షరం – మన ప్రపంచం

# కాకరకాయ జ్యూస్ ఆరోగ్య ప్రయోజనాలు పూర్తి వివరాలు



కాకరకాయ జ్యూస్ ఆరోగ్యానికి ఎంతో మేలు చేసే సహజ ఔషధ పానీయం. ఇందులో చారంటిన్ అనే సమ్మేళనం ఉండి రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో సహాయపడుతుంది. డయాబెటిస్ ఉన్నవారికి ఇది ప్రత్యేకంగా ఉపయోగకరం. ఉదయం ఖాళీ కడుపుతో తీసుకుంటే మంచి ఫలితాలు పొందవచ్చు.

రక్తంలో షుగర్ నియంత్రణలో కాకరకాయ ముఖ్య పాత్ర పోషిస్తుంది. ఇది ఇన్సులిన్ ప్రభావాన్ని మెరుగుపరచి గ్లూకోజ్ వినియోగాన్ని పెంచుతుంది. టైప్ 2 డయాబెటిస్ ఉన్నవారిలో రక్త చక్కెర స్థాయిలను తగ్గించడంలో సహాయపడుతుంది. అయితే మందులు తీసుకుంటున్నవారు వైద్యుడి సలహాతో మాత్రమే తీసుకోవాలి.

జీర్ణక్రియ మెరుగుపడుతుంది. కాకరకాయలో ఫైబర్ అధికంగా ఉండటం వల్ల మలబద్ధకం తగ్గుతుంది. గ్యాస్, అజీర్ణం వంటి సమస్యలు తగ్గుతాయి. కాలేయ ఆరోగ్యాన్ని కాపాడి శరీర శుద్ధికి సహాయపడుతుంది.

బరువు తగ్గడంలో సహాయపడుతుంది. తక్కువ క్యాలరీలు మరియు అధిక ఫైబర్ ఉండటం వల్ల ఎక్కువసేపు ఆకలి అనిపించదు. శరీరంలో కొవ్వు నిల్వలను తగ్గించడంలో సహాయపడుతుంది. ఆరోగ్యకరమైన డైట్‌లో భాగంగా తీసుకుంటే మంచి ఫలితాలు వస్తాయి.

రక్త శుద్ధి జరుగుతుంది. కాకరకాయ జ్యూస్ శరీరంలోని టాక్సిన్లను బయటకు పంపడంలో సహాయపడుతుంది. చర్మ సమస్యలు, మొటిమలు తగ్గించడంలో ఉపయోగపడుతుంది. రక్త ప్రసరణ మెరుగుపడుతుంది.

రోగనిరోధక శక్తి పెరుగుతుంది. ఇందులో విటమిన్ జ మరియు యాంటీఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఇవి శరీర రక్షణ వ్యవస్థను బలపరుస్తాయి. ఇన్‌ఫెక్షన్లను ఎదుర్కొనే శక్తిని పెంచుతాయి.


కాలేయ ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. కాకరకాయ జ్యూస్ కాలేయాన్ని శుభ్రపరచి దాని పనితీరును మెరుగుపరుస్తుంది. ఫ్యాటీ లివర్ సమస్యలను తగ్గించడంలో సహాయపడుతుంది. శరీరంలో కొవ్వు చక్కగా ప్రాసెస్ అవుతుంది.

చెడు కొలెస్ట్రాల్ (ాణూ) తగ్గించడంలో సహాయపడుతుంది. గుండె ఆరోగ్యాన్ని కాపాడుతుంది. రక్తనాళాలు ఆరోగ్యంగా ఉండేలా సహాయపడుతుంది. గుండె సంబంధిత సమస్యల ప్రమాదాన్ని తగ్గిస్తుంది.

ఎలా తాగాలి ఉదయం ఖాళీ కడుపుతో ఒక గ్లాస్ తాజా కాకరకాయ జ్యూస్ తాగడం మంచిది. చాలా చేదుగా ఉంటే కొద్దిగా నిమ్మరసం లేదా తేనె కలిపి తీసుకోవచ్చు. అధికంగా తీసుకోకుండా మితంగా వాడాలి. దీర్ఘకాలిక వ్యాధులు ఉన్నవారు వైద్యుల సలహా తీసుకోవాలి...

# తెలుగు రాష్ట్రాల్లో పెరగనున్న ఉష్ణోగ్రతలు

**మన దునియా,హైదరాబాద్: ఫిబ్రవరి 28**




తెలుగు రాష్ట్రాల్లో పెరగనున్న ఉష్ణోగ్రతలు బంగాళాఖాతంలో అల్పపీడనం ప్రభావంతో మారిన వాతావరణం నేపథ్యంలో, తెలుగు రాష్ట్రాల్లో రాబోయే మూడు రోజులు పొడి వాతావరణం నెలకొనే అవకాశం ఉందని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. ద్రోణి ప్రభావంతో వాతావరణం మారుతుందని పేర్కొంది. ఉత్తర కోస్తా ఆంధ్రప్రదేశ్, యానాం, దక్షిణ కోస్తా ఆంధ్రప్రదేశ్, రాయలసీమ ప్రాంతాల్లో శనివారం, ఆదివారం, సోమవారం పొడి వాతావరణం ఉంటుందని అంచనా వేసింది. తెలంగాణలోనూ పొడి వాతావరణమే కొనసాగే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. రాబోయే 3 రోజుల్లో కోస్తాంధ్రలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 2–3 డిగ్రీలు ఎక్కువగా నమోదయ్యే అవకాశం ఉంది.

# ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలు

**మన దునియా,మహబూబాబాద్ జిల్లా:కొత్తగూడ,ఫిబ్రవరి 28**




మహబూబాబాద్ జిల్లా: కొత్తగూడ మండల కేంద్రంలోని ఎంపీ యూపీఎస్ పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం విద్యార్థులు శాస్త్రీయ ఉత్సాహంతో వేడుకలను పాఠశాల ఆవరణలో విద్యార్థులకు వివిధ రకాల పోటీలను నిర్వహించారు. విద్యార్థులు తమ మేధస్సుకు పదును పెట్టి తయారు చేసిన సైన్స్ నమూనాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. శాస్త్రీయ దృక్పథం అవసరం ప్రధానోపాధ్యాయురాలు గుమ్మడి లలిత ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.... విద్యార్థులు చిన్నతనం నుండే శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలని,ప్రతి విద్యార్థి తన చుట్టూ జరిగే విషయాలను సునిషితంగా పరిశీలించాలని,ఆ పరిశీలనలే రేపటి కొత్త ఆవిష్కరణలకు పునాది వేస్తాయని ఆమె పేర్కొన్నారు.పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఆమె ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం సరస్వతి, తీగల రమేష్, నామాల మోహన్, బేబీ మేడం, కల్తీ రాధిక, ఆలూరి శంకర్, భరత్ విద్యార్థులు పాల్గొన్నారు.


# హెచ్ పి వి వ్యాక్సిన్ అంటే ఏమిటి?...దేనికి ఉపయోగం... ఎవరికి ఉపయోగం...ఏ రోగాన్ని నిరోధిస్తుంది!

**మన దునియా,న్యూఢిల్లీ:ఫిబ్రవరి 28**

బాలికల్లో పెరుగుతున్న సర్వైకల్ క్యాన్సర్ ముప్పును తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. ఇవాళ్టి నుంచి ఫిబ్రవరి 28, శనివారం నుంచి 14, 15 ఏళ్ల బాలికలకు ఫ్రీగా హెచ్ పి వి టీకా అందిస్తోంది. దేశవ్యాప్తంగా టీకా పంపిణీ భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించనున్నారు 9 సంవత్సరాల నుండి 14 సంవత్సరాల మధ్య వయస్సు గల అందరు బాలికలకు హెచ్ పి వి వ్యాక్సిన్ తప్పనిసరిగా వేయించాలి.

ఈ వ్యాక్సిన్ గర్భాశయ క్యాన్సర్ నుండి దాదాపు 98 శాతం రక్షణ కల్పిస్తుంది.

ఇది చాలా ప్రభావవంతమైన వ్యాక్సిన్, తగిన వయస్సులో ఇవ్వాలి. శరీరం రోగనిరోధక వ్యవస్థ చిన్న వయస్సులోనే మెరుగ్గా స్పందిస్తుంది. కాబట్టి 14 సంవత్సరాల వయస్సు ఉన్న బాలికలకు ఒకే మోతాదు సరిపోతుందని భావిస్తున్నారు. 15 సంవత్సరాలు, అంతకంటే ఎక్కువ వయస్సు ఉన్న బాలికలకు రెండు నుండి మూడు మోతాదులు అవసరం కావచ్చు. ఈ వ్యాక్సిన్ 26 సంవత్సరాల వయస్సు వరకు అత్యంత ప్రభావవంతంగా ఉంటుంది. పెద్ద వయసులో కూడా, మహిళలు వైద్యుడిని సంప్రదించిన తర్వాత ఈ వ్యాక్సిన్ పొందవచ్చు. హెచ్ పి వి వ్యాక్సిన్ గర్భాశయ క్యాన్సర్‌ను మాత్రమే కాకుండా కొన్ని ఇతర రకాల గొంతు క్యాన్సర్‌లను కూడా నివారించడంలో సహాయపడుతుంది. బలహీనమైన రోగనిరోధక శక్తి ఉన్న మహిళలకు గర్భాశయ క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. హెచ్ఐవి ఇన్ఫెక్షన్, బహుళ లైంగిక భాగస్వాములు, వ్యక్తిగత పరిశుభ్రత లేకపోవడం, ప్రారంభ దశలోనే గర్భం దాల్చడం,




ధూమపానం వంటి అలవాట్లు కూడా గర్భాశయ క్యాన్సర్ ప్రమాదాన్ని పెంచుతాయి. 30 ఏళ్ల తర్వాత మహిళలు క్రమం తప్పకుండా స్క్రీనింగ్ చేయించుకోవాలి, ఎందుకంటే ఈ క్యాన్సర్‌ను దాని ప్రారంభ లేదా క్యాన్సర్‌కు ముందు దశల్లో కూడా గుర్తించవచ్చు. సకాలంలో చికిత్స చేయడం వల్ల ప్రాణాలను కాపాడవచ్చు. గర్భాశయ క్యాన్సర్ కొన్ని హెచ్చరిక సంకేతాలను విస్మరించకూడదని నిపుణులు అంటున్నారు. సంభోగం తర్వాత అసాధారణ రక్తస్రావం, పీరియడ్స్ మధ్య సక్రమంగా రక్తస్రావం, దుర్వాసనతో కూడిన యోని ఉత్సర్గ లేదా రక్తం, రుతువిరతి తర్వాత రక్తస్రావం వంటి లక్షణాలు కనిపిస్తే, మీరు వెంటనే వైద్యుడిని సంప్రదించాలి. ప్రారంభ దశలో శస్త్రచికిత్సతో చికిత్స సాధ్యమే, కానీ అధునాతన దశలలో కీమోథెరపీ అవసరం కావచ్చు. అందువల్ల, 14 సంవత్సరాల వయస్సు ఉన్న అన్ని బాలికలు హెచ్ పి వి టీకాను తీసుకోవాలి. జననేంద్రియ పరిశుభ్రతను పాటించాలి..!

# వరంగల్ విమానాశ్రయ రన్‌వే కుదింపు..!

**పెద్ద విమానాలిక్కడ దిగలేవు..!!**

**మన దునియా,వరంగల్ జిల్లా: ఫిబ్రవరి 28**

వరంగల్ ఎయిర్‌పోర్టు రన్‌వే – 2.5 కి.మీ.

బేగంపేట ఎయిర్‌పోర్టు రన్‌వే – 3.2 కి.మీ.

శంషాబాద్ ఎయిర్‌పోర్టు రన్‌వే 4.2 కి.మీ.

విజయవాడ ఎయిర్‌పోర్టు రన్‌వే 3.36 కి.మీ. వరంగల్‌లో అంతర్జాతీయ స్థాయి విమానాశ్రయం కడుతున్నం అని భారీస్థాయిలో ప్రచారం చేసుకున్న రాష్ట్ర కాంగ్రెస్, కేంద్ర బీజేపీ సర్కార్లు, చివరికి రన్‌వే సైజును కేవలం 2.5 కిలోమీటర్లకు కుదించి వరంగల్ ప్రజలను నిరుత్సాహానికి గురిచేశారు.కనీసం 2.9 కిలోమీటర్ల రన్‌వే ఉంటే కానీ పెద్ద విమానాలు, అంతర్జాతీయ విమానాలు (వైడ్ బాడీ) దిగడానికి వీలు కాదు. అలాంటప్పుడు కేవలం 2.5 కిలోమీటర్ల పొడవైన రన్‌వేతో వరంగల్ విమానాశ్రయం కట్టాలని నిర్ణయించడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. గమనించాల్సిన విషయం ఏమిటంటే బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడు వరంగల్ ఎయిర్‌పోర్టును 3.9 కిలోమీటర్ల పొడవైన రన్‌వేతో కట్టాలని ప్రతిపాదించారు. అలా కట్టి ఉంటే ప్రపంచంలోని అతి పెద్ద విమానం కూడా ఇక్కడ ల్యాండ్ అయ్యే సౌకర్యం ఉండేది.వరంగల్ ఎయిర్‌పోర్టు టెక్నో ఎకనామిక్ ఫీజిబిలిటీ రిపోర్టులో కూడా రన్‌వే పొడవు 2.9 కిలోమీటర్లు ఉంటుంది అని స్పష్టంగా పేర్కొన్నారు.తీరా ఈ వారం కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, కింజరపు రాం మోహన్ నాయుడు సమావేశమయ్యి అనంతరం ఇచ్చిన ప్రకటనలో ఎయిర్‌పోర్టు రన్‌వే పొడవు 2.5 కిలోమీటర్లుగా పేర్కొన్నారు. అంటే దీనర్థం వరంగల్ ఎయిర్‌పోర్టు కేవలం చిన్న డొమెస్టిక్ విమానాలు మాత్రమే దిగేందుకు వీలుగా ఉంటుంది.



పెద్ద డొమెస్టిక్ విమానాలు కానీ, అంతర్జాతీయ విమాన సర్వీసులు కానీ నడపడానికి ఈ రన్‌వేతో వీలు కాదు. ఈ విషయం తెలిసినప్పటి నుండి వరంగల్ నెటిజెన్లు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఎప్పుడో వందేళ్ళ క్రితం కట్టిన హైదరాబాద్ బేగంపేట ఎయిర్‌పోర్టులోనే 3.2 కిలోమీటర్ల రన్‌వే ఉంది.ఇక 2008లో మొదలైన శంషాబాద్ విమానాశ్రయం రన్‌వే ఏకంగా 4.2 కిలోమీటర్ల పొడవు ఉంటుంది. పక్క రాష్ట్రంలోని విజయవాడ ఎయిర్‌పోర్టు రన్‌వే పొడవు 3.36 కిలోమీటర్లు ఉండగా వైజాగ్ విమానాశ్రయంలో రన్‌వే పొడవు 3.0 కిలోమీటర్లు ఉంది. మరి అత్యాధునికంగా, అంతర్జాతీయ ప్రమాణాలతో కడతాం అంటున్న వరంగల్ ఎయిర్‌పోర్టు కేవలం 2.5 కిలోమీటర్ల బుజ్జి రన్‌వేతో కడితే ఏం ప్రయోజనం అనే చర్చ ఇప్పుడు మొదలైంది.

# ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తుతో త్వరితగతిన పూర్తి చేయాలి








**విసిబుల్ పోలీసింగ్‌తో నేరాల నియంత్రణ**

**విధుల్లో అలసత్వం వహిస్తే శాఖాపరమైన చర్యలు**

**నెలవారి నేర సమీక్షా సమావేశం నిర్వహించిన జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్.**

**మన దునియా జయశంకర్ భూపాలపల్లి జిల్లా:ఫిబ్రవరి 28**

శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ ఐపీఎస్ ఆధ్వర్యంలో నెలవారి నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అండర్ ఇన్వెస్టిగేషన్‌లో ఉన్న గ్రేవ్, నాన్-గ్రేవ్, ఎస్సీ,ఎస్టీ, మిస్సింగ్ కేసుల వివరాలను సమగ్రంగా సమీక్షించారు.ప్రతి కేసులో నాణ్యమైన, వేగవంతమైన దర్యాప్తు జరగాలని, బాధితులకు న్యాయం అందించడంలో ఎలాంటి ఆలస్యం ఉండకూడదని స్పష్టం చేశారు. అత్యాచార, పోక్సో కేసులను నిర్ణీత గడువుల్లో పూర్తి చేసి నిందితులను కోర్టు ముందు నిలపాలని ఆదేశించారు.జిల్లాలో లాంగ్ పెండింగ్ కేసుల ఛేదనకు ప్రత్యేక ప్లాన్ ఆఫ్ యాక్షన్ సిద్ధం చేసి అమలు చేయాలని, ఎఫ్ఎస్ఎల్ రిపోర్టులు పెండింగ్‌లో ఉన్న కేసులను తక్షణమే పూర్తిచేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. మిస్సింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించి పురోగతి సాధించాలని, సీసీ కెమెరాల వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని తెలిపారు.ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో విసిబుల్ పోలీసింగ్ అమలు చేస్తూ ప్రతిరోజూ వాహన తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. విధుల్లో అలసత్వం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే, పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితుల సమస్యలను ఓపికగా విని, సమయానుకూలంగా స్పందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి డీఎస్పీ సంపత్ రావు, కాటారం డీఎస్పీ సూర్యనారాయణ, సీఐలు, ఎస్సైలు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

మన దునియా
RNI Number
మన అక్షరం - మన ప్రపంచం



# ఏపీలో కొత్త ఇళ్ల కోసం ఎదురు చూసేవారికి తీపికబురు..

# వచ్చే నెలలోనే ముహూర్తం.. రెడీగా ఉండండి..

**మన దునియా,ఆంధ్రప్రదేశ్: ఫిబ్రవరి 28**

ఏపీ ప్రజలకు కూటమి సర్కార్ ఉగాది గిఫ్ట్ అందించేందుకు రెడీ అవుతోంది. ఉగాది రోజున పేదలకు ఇళ్లను పంపిణీ చేయనుందని తెలుస్తోంది. టిడ్కో ఇళ్ల కోసం లబ్దిదారులు ఎప్పటినుంచో ఎదురుచూస్తున్నారు. ఇప్పుడు వారి కల నెరవేరనుంది. ఉగాది నాటికి పంపిణీ చేయనుంది.ఏపీలోని ఇల్లు లేనివారికి కూటమి సర్కార్ శుభవార్త అందించింది. కొత్త ఇళ్ల మంజూరుతో పాటు పూర్తైన ఇళ్లను పంపిణీ చేసేందుకు ప్రభుత్వం ముహూర్తం ఫిక్స్ చేసుకుంది. మార్చి 19న ఉగాదిని పురస్కరించుకుని పేదలకు ఇళ్లను మంజూరు, పంపిణీ చేసేందుకు సిద్దమైంది. పీఎం ఆవాస్ యోజన కింద ఇప్పటికే కొత్త ఇళ్ల కోసం దరఖాస్తులను ఆహ్వానించగా.. ఇప్పుడు వాటి పరిశీలన పూర్తైంది. ఉగాది రోజున అర్హులైన వారికి ఇళ్లను నిర్మించుకునేందుకు మంజూరు పత్రాలు అందించనున్నాయి. ఉగాది నాటికి కొత్త ఇళ్లను మంజూరు చేస్తామని ఏపీ సీఎం చంద్రబాబు కూడా పలుమార్లు ప్రకటించారు. ఆ దిశగా కసరత్తు జరుగుతూండగా.. తాజాగా మరో కీలక ప్రకటన కూడా ప్రభుత్వం నుంచి అందింది. అదేంటో ఇప్పుడు చూద్దాం.

ఉగాది రోజు టిడ్కో ఇళ్లు పంపిణీ

ఉగాది నాటికి లక్ష టిడ్కో ఇళ్లను పేదలకు పంపిణీ చేయాలని ఏపీ ప్రభుత్వం భావిస్తోంది. ఉగాది రోజున వీటిని లబ్దిదారులకు పంపిణీ చేయనుంది. 2014లో టీడీపీ అధికారంలో ఉన్న సమయంలో టిడ్కో ఇళ్ల నిర్మాణాన్ని చేపట్టింది. అయితే ఆ తర్వాత వైసీపీ అధికారంలోకి వచ్చాక ఈ ఇళ్ల నిర్మాణం పూర్తిగా నిలిచిపోయింది. వైసీపీ సర్కార్ పట్టించుకోకపోవడంతో పిచ్చి మొక్కలు పెరిగి ఇళ్లు పనికిరాకుండా పోయాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వీటి నిర్మాణంపై మళ్లీ దృష్టి పెట్టింది. వీటిని లబ్దిదారులకు అందించేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టింది. అందులో భాగంగా 40,500 మంది లబ్దిదారులకు ఇళ్లు అందించేందుకు వీటి నిర్మాణానికి రూ.1354 కోట్ల రుణాలు మంజూరు చేసేందుకు బ్యాంకులు అంగీకరించాయి.



5 లక్షల ఇళ్లకు గృహప్రవేశాలు

బ్యాంకు నిధులతో త్వరలోనే వీటి నిర్మాణాలు వేగంగా పూర్తి చేసి ఉగాది నాటికి లబ్దిదారులకు పంపిణీ చేసేలా కూటమి ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఉగాది రోజు వీటిని పేదలకు అందిస్తామని ఏపీ మున్సిపల్, పట్టణాభివృద్ధిశాఖ ముఖ్యకార్యదర్శి సురేశ్ కుమార్ తెలిపారు. ఈ టిడ్కో ఇళ్ల కోసం లబ్దిదారులు ఎప్పటినుంచో ఎదురుచూస్తున్నారు. ఎప్పుడెప్పుడు అందుతాయా అని కళ్లు కాయలు కాసేలా చూస్తున్నారు. ఇప్పుడు ఎట్టకేలకు మోక్షం లభించడం, త్వరలోనే పంపిణీకి ప్రభుత్వం సిద్దమవ్వడంతో లబ్దిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఉగాది నాటికి 5 లక్షల ఇళ్లకు గృహప్రవేశాలు చేయించడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకెళ్తుంది. మరోవైపు ఉగాది రోజున మరికొన్ని ప్రభుత్వ కార్యక్రమాలను ప్రారంభించేందుకు ప్రభుత్వం సిద్దమవుతోంది. విశాఖపట్నంలోని కైలాసగిరిపై భారీ త్రిశూలాన్ని ఆవిష్కరించేందుకు సిద్దమవుతోంది. మొత్తానికి ఉగాదికి ప్రజలకు ప్రభుత్వం మరిన్ని గిఫ్ట్‌లు ఇచ్చేందుకు రెడీ అవుతోందని చెప్పవచ్చు.

# మార్చి 2న దహనం.. 4న హోలీ..

**హోలీ పండుగ పై షాద్ నగర్ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ స్పష్టత..**

**మన దునియా,షాద్ నగర్: ఫిబ్రవరి 28**

తెలుగువారి వేడుకల్లో ఒకటైన హోలీ పండుగకు సంబంధించి వేద బ్రాహ్మణుల పరిశీలన ద్వారా తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ స్పష్టత ఇచ్చినట్లు సంక్షేమ పరిషత్ షాద్ నగర్ నియోజకవర్గ అధ్యక్షుడు వెంకటేశ్వరరావు తెలిపారు. గౌరవ అధ్యక్షుడు రామ సత్యనారాయణ శర్మ, జిల్లా అధ్యక్షుడు సంబరాజు రవి శర్మ, పండితులు రాజశేఖర్ శర్మ, వెంకటేశ్వర శర్మ, నాగరాజు శర్మల ఆధ్వర్యంలో శాస్త్రానుకూలంగా నిర్ణయించిన ప్రకారం మార్చి 2వ తేదీన కామ దహనం, మార్చి 4వ తేదీన హోళీ కార్యక్రమాలు ఉంటాయని వివరించారు. మార్చి మూడవ తేదీన చంద్రగ్రహణం ఉన్నందున పండుగ జరుపుకోకూడదని, ప్రత్యక్ష దైవం చంద్రుడు వేదనకు గురి అవుతున్న తరుణంలో పండగ నిర్వహించడం శాస్త్ర విరుద్ధమని వారు తెలిపినట్లు వివరించారు. కాబట్టి వేద బ్రాహ్మణులు నిర్ణయించిన ప్రకారం ప్రతి ఒక్కరు పండుగ వేడుకలు జరుపుకోవాలని ఆయన సూచించారు..



# ప్రభుత్వ భూమిలో అక్రమ రేకుల షెడ్ల నిర్మాణాన్ని తొలగించాలని

**మన్య సీమ పరిరక్షణ సమితి డోలు దెబ్బ రాష్ట్ర అధ్యక్షులు గొప్ప వీరయ్య**

**మన మంగపేట:(మన దునియా న్యూస్)**

షెడ్యూల్ ఏరియా ఏజెన్సీ ప్రాంతము మంగపేట తాహసిల్ పరిధిలోని పద్మార్ రెవెన్యూ గ్రామం సర్వేనెంబర్ 107/1లో0-08 గుంటల ప్రభుత్వ భూమిలో రేకుల షెడ్డు సిమెంటు స్తంభాలతో నిర్మాణం చేసినారు ఇట్టి అక్రమ నిర్మాణాన్ని తొలగించుటకు మంగపేట డిప్యూటీ తాహసిల్దార్ మల్లేశ్వరరావు ను కలిసి మెమొరండం ఇచ్చిన మన్య సీమ పరిరక్షణ సమితి డోలు దెబ్బ మంగపేట మండల అధ్యక్షుడు తాటి నాగరాజు చేయు ప్రతినిత్యం ఏమనగా మా షెడ్యూల్ ఏరియా ఏజెన్సీ ప్రాంతము గిరిజన ప్రాంతంలో మాకు దక్కవలసిన ప్రభుత్వ భూములు మా గిరిజనులకు1/59,1/70,పెసా చట్టం, 1998 పెసా చట్టం రూల్స్ 2011 ప్రకారము పెసా గ్రామసభ తీర్మాణములు జరిగిన తర్వాత ఇండ్ల నిర్మాణములు జరగాలి కానీ పాముల పాష అనే గిరిజనేతరుడు ప్రభుత్వ భూములు ఆక్రమించుకొని ఇతర మరొక గిరిజనేతరులకు అమ్ముకొని సొమ్ము చేసుకోవడం జరుగుతుంది 25-02-2026 రోజున రాత్రి దొంగతనంగా సిమెంటు స్తంభాలతో రెండు షెడ్లు నిర్మాణము సర్వేనెంబర్ 107/1లో 0-08 గుంటల ప్రభుత్వ భూమిలో నిర్మాణం చేస్తున్నాడు అందులో మా ఆదివాసి గిరిజన మహిళలకు రెండు గుంటల ప్రభుత్వం పట్టా ఇచ్చినారు మిషన్ భగీరథకు స్థలం ఇచ్చినరు మా గిరిజనులకు ఇచ్చిన స్థలంలో పాముల పాషా నిర్మాణము చేస్తున్నాడు ప్రభుత్వ భూములు మాకు చెందుతాయి అని హైకోర్టు లో 2016 లో వేసినాము హైకోర్టులో కేసు ఉంది కావున మా నిరుపేదల పట్ల దయచేసి మంగపేట నుండి కోమటిపల్లి వెళ్లే దారి పక్కన కుడివైపు రెండు అక్రమ షెడ్లు నిర్మించినారు వెంటనే వాటిని తొలగించాలని మంగపేట డిప్యూటీ తహసిల్దార్ ను కలిసి వివరించిన మన్యసీమ పరిరక్షణ సమితి డోలు దెబ్బ రాష్ట్ర అధ్యక్షులు గొప్ప వీరయ్య, మంగపేట మండలం అధ్యక్షుడు తాటి నాగరాజు, మన్య సీమ జిల్లా ఉపాధ్యక్షులు ఆక తిరుమలరావు, తదితరులు పాల్గొన్నారు



## ఇంటర్ పరీక్షా కేంద్రంలోని టాయ్‌లెట్‌లో మృత శిశువుకు జన్మనిచ్చిన మైనర్ బాలిక

**మన దునియా,భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ:ఫిబ్రవరి 28**

పాల్వంచలోని ఓ కేంద్రానికి ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న 16 ఏళ్ల బాలిక ఇంగ్లిష్ పరీక్ష రాయటానికి వచ్చి.. పరీక్ష ప్రారంభమైన తర్వాత ఇన్విజిలేటర్ అనుమతితో టాయ్‌లెట్‌కు వెళ్లిన విద్యార్థిని ఎంతసేపటికీ రాకపోవటంతో ఆమె మరుగు దొడ్డి వైపు వెళ్లి చూడగా.. బాలిక చిన్నగా నడుచుకుంటూ బయటికి రావడంతో, అనుమానం వచ్చి బాలిక వివరాలు ఆరా తీయటంతో బైటపడ్డ అసలు విషయం సిబ్బంది వెళ్లిచూడగా.. బేసిన్‌లో పడి ఉన్న మృతశిశువు అయితే పరువు పోతుందనే భయంతోనే ఎవరికీ అనుమానం రాకుండా శిశువును బాత్రూం బేసిన్‌లో కుక్కినట్లు తెలిపిన బాలిక...

## జన్నారం అడవి పరిరక్షణలో డ్రోన్ల టెక్నాలజీ




**మన దునియా ప్రతినిధి శరత్ ఫిబ్రవరి:28**

జన్నారం మండలం ఇంధన్ పల్లి రేంజ్ పరిధిలోని అటవీ ప్రాంతం లో డ్రోన్ శిక్షణ మరియు పర్యవేక్షణ జరిగింది, హైదరాబాద్ హెడ్ ఆఫీస్ నుండి వచ్చిన జిఐఎస్ ప్రతినిధి రవికిరణ్ మరియు సిబ్బంది జన్నారం అటవీ సిబ్బందికి శిక్షణా ఇచ్చారు,దీని ద్వారా అటవీ పర్యవేక్షణ సులభం అవ్వుతుందని, తెలిపారు. నిఘా మరియు అక్రమ కార్యకలాపాల అడ్డుకట్ట: దట్టమైన అడవుల్లోమనుషులు వెళ్లలేని ప్రదేశాలలో డ్రోన్లు ఎగిరిఅక్రమ నరికివేత మరియు వేటను నిరంతరం పర్యవేక్షిస్తాయి. అటవీ మంటల గుర్తింపు థర్మల్ కెమెరాలను ఉపయోగించి డ్రోన్లు అడవిలో మంటలను ముందుగానే గుర్తించి మంటలు వ్యాపించకుండా వేగవంతమైన సహాయ చర్యలకు ఫారెస్ట్ అధికారులకు సమాచారం అందిస్తాయి. వన్యప్రాణుల పర్యవేక్షణ: అడవిలోని జంతువుల కదలికలను మరియు అంతరించిపోతున్న జాతుల రక్షణను డ్రోన్ల ద్వారా సులభంగా ట్రాక్ చేయవచ్చు. అక్రమ ఇసుక రవాణా చేసే వారిని కనుగొనవచ్చు అని శిక్షకులు తెలిపారు. ఇక మీదట జన్నారం డివిజన్లో డ్రోన్ ద్వారా పర్యవేక్షణ ఉంటుంది ఇది రాత్రి సమయంలో కూడా పని చేస్తుందని ఇంధన్ పల్లి ఎఫ్ ఆర్ ఓ లక్ష్మీనారాయణ తెలిపారు.

## మహమ్మద్ గౌస్‌పల్లిలో ఘోర రోడ్డు ప్రమాదం

**మన దునియా,మల్లంపల్లి ఫిబ్రవరి 28**




మల్లంపల్లి మండలం మహమ్మద్ గౌస్‌పల్లిలో శనివారం సాయంత్రం రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. వరంగల్‌ములుగు జాతీయ రహదారిపై కారు మరియు ద్విచక్ర వాహనం ఢీకొన్న ఘటనలో ఒక వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనం నడుపుతున్న వ్యక్తికి కాలు పాదం తెగిపడింది. ఘటనను గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని పరిస్థితిని పరిశీలిస్తున్నారు.ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.

## ఓటమి గెలుపుకు నాంది- ఎంపీ డీకే అరుణమ్మ

**44% ఓటింగ్ ఇచ్చిన 24వ ప్రజలకు ధన్యవాదాలు**

**వంశీకృష్ణను అభినందించిన డీకే అరుణమ్మ**

**మన దునియా జోగులంబ గద్వాల జిల్లా:ఫిబ్రవరి 28**



మున్సిపల్ ఎన్నికల్లో మాజీ మున్సిపాల్ చైరన్ అగ్గనూరు విశాల విశ్వం పైన కేవలం 24 ఓట్ల స్వల్ప తేడాతో పోరాడి ఓడిన బీజేపీ యువ నాయకుడు వంశీకృష్ణ పోరాట స్ఫూర్తి భవిష్యత్ గెలుపుకు నాంది అని పేర్కొన్నారు. ప్రజల విశ్వాసం పొందడం నిజమైన విజయమని అభిప్రాయపడ్డారు. ఓటమితో కృంగిపోవద్దని మానసిక స్థైరంతో ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండాలి అన్నారు. ఎంపీ డీకే అరుణ వంశీకృష్ణను అభినందిస్తూ, రాష్ట్రంలో అధికారంలో లేకపోయినా పార్టీ నిర్ణయం మేరకు తన వార్డు కాకపోయినా ధైర్యంగా పోటీ చేయడం అభినందనీయం అన్నారు. యువ నాయకుడిగా ఆయన చేసిన పోరాటాన్ని కొనియాడారు.మొత్తం 44% ఓటు శాతం సాధించడం ప్రజల విశ్వాసానికి నిదర్శనం అని తెలిపారు. పెద్ద ఎత్తున మద్దతు తెలిపిన 24వ వార్డు ప్రజలకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తూ, అభివృద్ధి విషయంలో తన సహకారం ఎల్లవేళలా ఉంటుందని డీకే అరుణమ్మ పేర్కొన్నారు..

మన దునియా

మన అక్షరం - మన ప్రపంచం

## రక్షిత్ హాస్పిటల్ లో ప్రజాపక్షం రిపోర్టర్ ఆలుగొండ రమేష్ కూతురిని పరామర్శించిన బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు భూక్య జంపన్న



**మంగపేట పిబ్రవరి 28: మన దునియా న్యూస్**

ఈ రోజు హనుమకొండలోని రక్షిత్ హాస్పటల్లో ప్రజాపక్షం ములుగు జిల్లా స్టాఫ్ రిపోర్టర్ ఆలుగొండ రమేష్ చిన్న కూతురు జోష్నా అనారోగ్యంతో రక్షిత్ హాస్పటల్లో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న భూక్య జంపన్న హాస్పటల్కి వెళ్లి జోష్నా ని పరామర్శించారు డాక్టర్ తో మాట్లాడి జోష్నా ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్నారు భూక్య జంపన్న మాట్లాడుతూ బీటెక్ థర్డ్ ఇయర్ సివిల్ ఇంజనీర్ చదువుతున్న జోష్నా మూడు సంవత్సరాలగా హాస్టల్ లో ఉంటూ కాకతీయ యూనివర్సిటీ కాలేజీలో చదువుతూ ఉంటుంది ఆమె హాస్టల్లో ఉండటంవల్ల ఫుడ్ కడప వేడి గడ్డలు కావడం వల్ల ఇలా ఆపరేషన్ జరగడం బాధాకరమని ఆయన అన్నారు వెంటనే విద్యార్థిని కోల్కొని తిరిగి కాలేజీకి పోవాలని కోరుకున్నారు అలాగే డాక్టర్ తో మాట్లాడి జోష్నాకి మెరుగైన వైద్యం అందించాలని కోరారు.

## హైదరాబాద్ హోటళ్లలో కల్తీ నెయ్యి కలకలం..!

**హైదరాబాద్‌లోని ప్యారడైజ్ హోటల్‌లో కల్తీ నెయ్యి వాడినట్లుగా రిపోర్టు.**

**జీహెచ్ఎంసీ సేకరించిన నమూనాలు అసురక్షితమని ల్యాబ్ రిపోర్ట్.**

**ల్యాబ్ రిపోర్ట్‌ను సవాలు చేసిన నెయ్యి తయారీ సంస్థ.**

**మరోసారి పరీక్షల కోసం నమూనాలను మైసూర్ పంపిన అధికారులు.**



**మన దునియా,హైదరాబాద్: ఫిబ్రవరి 28**

హైదరాబాద్ నగరంలోని ఆహార ప్రియులకు షాక్ తగిలేలా, ప్రముఖ ప్యారడైజ్ హోటల్‌లో కల్తీ నెయ్యి వాడుతున్నట్లు వార్తలు కలకలం రేపుతున్నాయి. గత నెల రోజుల వ్యవధిలో నగరంలో కల్తీ నెయ్యికి సంబంధించి ఇది మూడో ఘటన కావడం గమనార్హం. మార్కెట్ లో నెయ్యికి ఉన్న డిమాండ్ నేపథ్యంలో కొన్ని సంస్థలు రసాయనాలు, కూర నూనెలతో కల్తీ నెయ్యి తయారు చేస్తున్నాయనే ఆరోపణలు వచ్చాయి. ఈ క్రమంలో సాధారణ తనిఖీల్లో భాగంగా జీహెచ్ఎంసీ అధికారులు ఖైరతాబాద్ జోన్‌లోని ఐమాక్స్ వద్ద ఉన్న ప్యారడైజ్ హోటల్‌లో, మరో రెండు చోట్ల తనిఖీలు నిర్వహించారు. హోటల్‌లో వాడుతున్న 'సుధీర్ ఇండస్ట్రీస్' బ్రాండ్‌కు చెందిన నెయ్యి నమూనాలను సేకరించి, నాచారంలోని రాష్ట్ర ఆహార భద్రత ప్రయోగశాలకు పంపించారు. అక్కడ జరిపిన పరీక్షల్లో ఆ నెయ్యి తినడానికి సురక్షితం కాదని (అన్‌సేఫ్) తేలినట్లు సమాచారం. అయితే, ప్రభుత్వ ల్యాబ్ ఇచ్చిన రిపోర్టును నెయ్యి తయారీ సంస్థ సవాలు చేసింది. దీంతో జీహెచ్ఎంసీ అధికారులు తదుపరి చర్యలకు ఉపక్రమించారు. ఆ నమూనాలను మరోసారి పరీక్షించేందుకు మైసూర్‌లోని కేంద్ర ప్రభుత్వ ప్రయోగశాలకు పంపినట్లు తెలిసింది. మైసూర్ ల్యాబ్ నివేదికలో కూడా నెయ్యి కల్తీ అని, ప్రమాదకరమని తేలితే తయారీ సంస్థపై క్రిమినల్ కేసు నమోదు చేస్తామని జీహెచ్ఎంసీ అధికారులు స్పష్టం చేశారు. ప్రస్తుతం మైసూర్ నుంచి రాబోయే తుది నివేదిక కోసం అధికారులు ఎదురుచూస్తున్నారు.

## ఢిల్లీ అసెంబ్లీ రద్దు చేసి ఎన్నికలకు వెళ్లండి..!

**మన దునియా,ఢిల్లీ:ఫిబ్రవరి 28**

ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో కోర్టు నుంచి క్లీన్ చిట్ పొందిన వెంటనే మాజీ సీఎం అర్వింద్ కేజ్రీవాల్ బీజేపీపై తీవ్ర విమర్శలు గుప్పించారు. ఢిల్లీ అసెంబ్లీని తక్షణమే రద్దు చేసి ప్రజల ముందుకు వెళ్లాలని సవాల్ విసిరారు. తనపై, తన కుటుంబ సభ్యులపై అక్రమ కేసులు బనాయించి రాజకీయంగా ఇబ్బందులకు గురిచేశారని ఆరోపించారు. మద్యం విధానం పూర్తిగా పారదర్శకంగా అమలు చేశామని, రాజకీయ కుట్రతోనే ఆమ్ ఆద్మీ పార్టీ ను దెబ్బతీయాలని ప్రయత్నిస్తున్నారని అన్నారు. బీజేపీ పాలనలో ఢిల్లీ అభివృద్ధి ఆగిపోయిందని, ప్రజలు సుఖసంతోషాలతో లేరని వ్యాఖ్యానించారు. ప్రజల తీర్పే తుది తీర్పని పేర్కొంటూ వెంటనే ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా, ఈ కేసుకు సంబంధించి. ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టర్ నమోదు చేసిన కేసులను రద్దు చేయాలని కోరుతూ ఢిల్లీ కోర్టును ఆశ్రయిస్తామని కేజ్రీవాల్ స్పష్టం చేశారు.

# పట్టుదలతో అందరం కలిసి మహా జాతరను విజయవంతం చేశాం.










**అభివృద్ధి పనులు అనేవి నిరంతర ప్రక్రియ.**

**200 సంవత్సరాలు నిలిచిపోయేలా పనులు చేశాం.**

**పూర్తికాని 5 శాతం పనులను వెంటనే పూర్తి చేయాలి.**

**బాసర నుంచి భద్రాచలం వరకు ఆలయాల అభివృద్ధి.**

**రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి.**

**మన దునియా,ఎస్.ఎస్.తాడ్వాయి**

**ములుగు జిల్లా:ఫిబ్రవరి 28**

గత నెల 28 నుండి 31వ తేదీ వరకు జరిగిన మేడారం మహా జాతర విజయవంతం కావడానికి అందరం పట్టుదలతో పనిచేయడం వల్లే విజయవంతమైందని, మేడారంలో భక్తులకు సౌకర్యాలు కల్పించే విషయం నిరంతర ప్రక్రియ అని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. శనివారం ములుగు జిల్లా ఎస్.ఎస్. తాడ్వాయి మండలం మేడారం శ్రీ సమ్మక్క సారలమ్మ దేవాలయం నకు హెలికాప్టర్ లో చేరుకున్న రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క లకు జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్, ఎస్పీ సుధీర్ రామ్ నాథ్ కేకన్, డి ఎఫ్ ఓ రాహూల్ కిషన్ జాదవ్, తదితరులు పుష్ప గుచ్చాలు ఇచ్చి ఘన స్వాగతం పలికారు. రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి,రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క లు వన దేవతలను దర్శించుకున్నారు. మంత్రులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి, దనసరి అనసూయ సీతక్క సమ్మక్క సారలమ్మ గోవిందరాజు పగిడిద్ద రాజు దేవతల గద్దెల చుట్టూ రాతి నిర్మాణాన్ని, ఆలయ చుట్టూ ప్రకారం , ప్రధాన ఆర్చిలను, ప్రహరీ సాండ్ స్టోన్ చిత్రాలను, చుట్టూ డ్రైనేజీ, మీడియా టవర్ లను, గద్దెల చుట్టూ ఉన్నా గ్రిల్స్ లను ఆలయ ఫ్లోరింగ్ ను కూలంకషంగా పరిశీలించారు. అనంతరం వాహనం లో జంపన్న వాగు, హరిత,ఊరట్టం, చిలకల గుట్ట, ఆర్ టి సి జంక్షన్ లను కూలంకషంగా పరిశీలించారు. అనంతరం మంత్రులు మేడారంలోని హరిత హోటల్ లో సంబంధిత శాఖల ఉన్నత జిల్లా అధికారులతో , మేడారం జాతర అభివృద్ధి పనుల పై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి శాఖల వారిగా పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ మేడారంలోని సమ్మక్క సారలమ్మలను దర్శించుకోవడానికి నిత్యం భక్తులు వివిధ ప్రాంతాల నుండి చేరుకుంటున్నారని, సెలవు రోజులలో లక్షలాదిమంది భక్తులు అమ్మవార్ల దర్శన భాగ్యం కోసం చేరుకుంటున్నారని అన్నారు. మేడారం చేరుకునే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు ఏర్పడకుండా నిరంతరం ఏర్పాట్లు చేస్తూనే ఉండాలని, ముఖ్యంగా పారిశుద్ధ్య పనులపై దృష్టి సారించాలని సూచించారు. ఆలయ ప్రాంతంలో చేపట్టిన పునర్నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, గుత్తేదారులకు ఎట్టి పరిస్థితుల్లో బిల్లులు ఆపే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఒక పట్టుదలతో ఈ జాతరను ఎన్నడు లేని విధంగా విజయవంతం చేయాలన్న సంకల్పంతో 251 కోట్ల రూపాయలు కేటాయించడం జరిగిందని, ప్రధాన ద్వారం తో పాటు గద్దెల ప్రాంతం చరిత్రలో నిలిచిపోయే విధంగా ఏర్పాట్లు చేశామని, 2 వందల సంవత్సరాల వరకు చెక్కుచెదరకుండా పనులు చేయడం జరిగిందని వివరించారు. మహా జాతరకు వచ్చిన భక్తులకు త్రాగునీరు ఇబ్బంది ఏర్పడకుండా చర్యలు తీసుకోవడంతో పాటు నివాస స్థలాలు ఏర్పాటు చేసి అధికారులు విజయవంతం చేశారని, ముఖ్యంగా పారిశుద్ధ్య పనులపై దృష్టి సారించడం చెప్పుకోదగ్గ విషయమని అధికారులను అభినందించారు. జాతరకు ముందే 95 శాతం వరకు పనులు పూర్తయ్యాయని, మిగతా ఐదు శాతం పనులను సైతం వెంటనే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆలోచించి ప్రకారం ఆలయం పునర్నిర్మాణం చేయడం జరిగిందని, భవిష్యత్తు తరాలకు 200 సంవత్సరాల వరకు ఎంత మంది భక్తులు వచ్చిన వారందరికీ ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కావాల్సిన వసతులను రోడ్ల విస్తరణ నివాసయోగ్యం ఇతర వసతులు కల్పించడం జరిగిందని, అమ్మవార్ల గద్దెలు, ఆలయ ప్రకారం, ప్రజా ప్రభుత్వం చేసిన అభివృద్ధి ప్రపంచం మొత్తం జాతర వైపు చూసిందని పేర్కొన్నారు. భక్తుల రద్దీ దృష్ట్యా మిగిలిన పనులను త్వరలోనే నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ పూర్తిస్థాయిలో పెండింగ్ పనులను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. మేడారం ప్రాంతంలో ఉన్న రెండు చెరువులను సుందరీకరించాలని వాటికి సంబంధించిన ప్రతిపాదనలను సిద్ధం చేయాలని సూచించారు. ముఖ్యమంత్రి ఆదేశాల ప్రకారం జంపన్న వాగులో నిరంతరం నీరు ప్రవహించే విధంగా చెక్ డాం ల నిర్మాణానికి ప్రణాళికల సిద్ధం చేయాలని, రహదారులకు ఇరువైపులా ప్లాంటేషన్ చేయాలని అన్నారు. భక్తులు రద్దీగా ఉండే ప్రదేశాలను గుర్తించి శాశ్వత ప్రతిపాదికన త్రాగునీరు మరుగుదొడ్లు మౌలిక వసతులు కల్పించాలని, జాతర సమయంలో దెబ్బతిన్న చిన్నచిన్న పనులను ఆలయ ఫ్లోరింగ్ డ్రైనేజీ వ్యవస్థ లోపాలను గుర్తించి వాటిని వెంటనే సరి చేయాలని ఆదేశించారు. అనంతరం మంత్రి అనసూయ సీతక్క మాట్లాడుతూ మొట్టమొదటిసారిగా జాతర అనంతరం అభివృద్ధి పనులపై సమీక్ష సమావేశం నిర్వహించడం జరిగిందని, జాతర అనంతరం కూడా అధికారులకు మరింత బాధ్యత పెరిగిందని మనసా వాచా కర్మణా మిగిలిన పనులను పూర్తి చేయాలని అన్నారు. మేడారం ప్రాంతాన్ని మరింత అభివృద్ధి చేయడం కోసం ప్రజా ప్రభుత్వం రెండవ మాస్టర్ ప్లాన్ సిద్ధం చేయడం జరుగుతుందని దానిలో భాగంగా మేడారం ప్రాంతంలోని రెండు చెరువులను అభివృద్ధి చేయడం ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్, మీడియా భవన్ వంటి నిర్మాణాలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. జాతర విజయవంతంలో అధికారులు చేసిన కృషి ఎన్నటికీ మరువలేమని కొనియాడారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమ్మవార్ల శక్తిని గ్రహించి ప్రతి పని విషయంలో చొరవ చూపారని, ఏకంగా క్యాబినెట్ సమావేశం నిర్వహించి అమ్మవార్ల భక్తి చాటారని అన్నారు. నిత్యం తరలివస్తున్న భక్తులకు అసౌకర్యం ఏర్పడకుండా అన్ని శాఖల అధికారులు సిద్ధంగా ఉండాలని అన్నారు. అనంతరం పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మీడియా తో మాట్లాడుతూ 2026 మేడారం మహా జాతర అంగరంగ వైభవంగా నిర్వహించడం జరిగిందని విజయవంతానికి కృషి చేసిన అధికారులు సహకరించిన ప్రతి ఒక్కరికి ప్రజా ప్రభుత్వం తరపున కృతజ్ఞతలు తెలియజేశారు. నాలుగు రోజులు పాటు జరిగిన మహా జాతరకు 1 కోటి 55 లక్షల మంది భక్తులు రావడం జరిగిందని, భవిష్యత్ తరాలకు 200 సంవత్సరాలు చెక్కుచెదరకుండా ఆలయం పునరుద్ధరణ చేయడం జరిగిందని భక్తుల రద్దీ కారణంగా మిగిలిన సూక్ష్మ పనులు కూడా వెంటనే పూర్తి చేయాలని అధికారులు ఆదేశించినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి సూచన మేరకు జంపన్న వాగులో 365 రోజులు నీరు ఉండే విధంగా గోదావరి నది జలాలను జంపన్న వాగుకు మళ్ళించడానికి ప్రణాళికలు తయారు చేస్తున్నామని స్పష్టం చేశారు. భక్తుల సౌకర్యార్థం పుణ్య స్నానాలు ఆచరించడానికి రెండు నుంచి మూడు మీటర్ల ఎత్తు నీరు నిల్వ ఉండే విధంగా జంపన్న వాగుపై ఐదు చెక్ డాం ల నిర్మాణాలు చేయడానికి అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారని, మేడారం ప్రాంతంలో ఉన్న రెండు చెరువులను సుందరీకరించి అభివృద్ధి చేయడం జరుగుతుందని అన్నారు. బాసర నుండి భద్రాచలం వరకు గోదావరి నది పరివాహక ప్రాంతంలో ఉన్న దేవాలయాలను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయడానికి ప్రజా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటున్నట్లు వెల్లడించారు. మంత్రి సీతక్క మీడియాతో మాట్లాడుతూ జాతర విజయవంతానికి తోడ్పడిన జిల్లా ఇన్చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, దేవాదాయ శాఖ మంత్రి కొండ సురేఖ, గిరిజన శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ గార్లకు , కృషిచేసిన అధికారులకు కృతజ్ఞతలు తెలియజేశారు. జాతర అనంతరం మరిన్ని అభివృద్ధి పనులను చేపట్టడం జరుగుతుందని భవిష్యత్తులో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా పనులను నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ పనులను పూర్తి చేస్తున్నామని తెలిపారు. జాతర నిర్వహణలో జరిగిన అసత్య ప్రచారాలు చేసిన వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ & బి ఈ ఎన్ సి మోహన్ నాయక్ , జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ సి హెచ్ మహేందర్ జి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ భానోత్ రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి, ములుగు మునిసిపాలిటీ చైర్మెన్ చింతనిప్పుల చంద్రకళ, ఈ ఓ వీరస్వామి, పూజారులు, ఇతర ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.


మన దునియా

మన అక్షరం – మన ప్రపంచం

ఫిబ్రవరి । మార్చ్ । 1 । 2026




# పాక్ నిష్క్రమణ.. సెమీఫైనల్ వేదికలు ఖరారు..!



పొట్టి ప్రపంచకప్ నుంచి పాకిస్థాన్ నిష్క్రమించడంతో భారత్‌లోనే బిగ్ మ్యాచ్‌లు జరుగనున్నాయి. సూపర్ 8 చివరి మ్యాచ్‌లో శ్రీలంకను 147లోపు కట్టడి చేయలేక పాక్ ఇంటిదారి పట్టడంతో సెమీస్ వేదికలపై నెలకొన్న సందిగ్ధతకు తెరపడింది. న్యూజిలాండ్ ఫైనల్ చేరడంతో.. ఈడెన్ గార్డెన్స్, వాంఖడేలో సెమీ ఫైనల్ మ్యాచ్‌లు నిర్వహించేందుకు బీసీసీఐ సిద్ధమవుతోంది. గ్రూప్ బీ నుంచి న్యూజిలాండ్ సెమీస్ బెర్తు పట్టేయగా.. భారత్‌లోనే షెడ్యూల్ ప్రకారం అనుకున్న సెమీ ఫైనల్, ఫైనల్ వేదికల్ని ఐసీసీ, బీసీసీఐ ఖరారు చేశాయి. ఒకవేళ పాక్ అర్హత సాధించి ఉంటే కొలంబోలోనే సెమీస్, ఒకవేళ ఫైనల్‌కు చేరితే.. ఈ మ్యాచ్ కూడా అక్కడే ఆడించాల్సి వచ్చేది.కానీ, సల్మాన్ అఘా బృందం గెలిచినా కివీస్ రన్ రేటు(+1.390)ను అధిగమించలేకపోవడం భారత్‌కు ప్లస్ అయింది. మార్చి 4న జరిగే తొలి సెమీస్‌ను కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్‌లో, మార్చి 5న రెండో సెమీస్ మ్యాచ్‌ను ముంబైలోని వాంఖడేలో నిర్వహించనున్నారు. టైటిల్ పోరు అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోడీ స్టేడియంలో మార్చి 8వ తేదీన జరుగనుంది.

రత్ననాయకే, షనక మెరుపులు

పొట్టి ప్రపంచకప్ నుంచి వెళ్తూ వెళ్తూ పాకిస్థాన్‌ను తీసుకెళ్లింది శ్రీలంక. ఆద్యంతం ఉత్కంఠగా సాగిన సూపర్ 8 చివరి మ్యాచ్‌లో పాక్ సెమీస్ ఆశల్ని ఆవిరి చేసింది ఆతిథ్య జట్టు. ఓపెనర్ ఫర్హాన్(100) సెంచరీ, ఫఖర్ జమాన్(84) విధ్వంసంతో భారీ స్కోర్ చేసిన పాక్.. లంకను 147లోపే కట్టడి చేయలేకపోయింది. దసున్ శనక(76 నాటౌట్), పవన్ రత్ననాయకే(58)లు చితక్కొడుతూ పాక్ బౌలర్లను నీరుగార్చారు.ఫలింతగా గ్రూప్ బీ నుంచి న్యూజిలాండ్ సెమీస్‌కు దూసుకెళ్లింది. ఓదార్పు విజయంతో సల్మాన్ అఘా బృందం టోర్నీ నుంచి నిష్క్రమించింది. శ్రీలంకను 147లోపు కట్టడి చేయలేకపోయారు. స్పిన్నర్లు చెలరేగినా.. పవన్ రత్ననాయకే(58) అర్ధశతకంతో విరుచుకుపడి పాక్ ఆశలపై నీళ్లు చల్లాడు.

# రత్ననాయకే మెరుపులు.. విజయంతో వీడ్కోలు పలికిన పాకిస్థాన్..!

పొట్టి ప్రపంచకప్ నుంచి వెళ్తూ వెళ్తూ పాకిస్థాన్‌ను తీసుకెళ్లింది శ్రీలంక. ఆద్యంతం ఉత్కంఠగా సాగిన సూపర్ 8 చివరి మ్యాచ్‌లో పాక్ సెమీస్ ఆశల్ని ఆవిరి చేసింది ఆతిథ్య జట్టు. ఓపెనర్ ఫర్హాన్(100) సెంచరీ, ఫఖర్ జమాన్(84) విధ్వంసంతో భారీ స్కోర్ చేసిన పాక్.. లంకను 147లోపే కట్టడి చేయలేకపోయింది. దసున్ శనక(76 నాటౌట్), పవన్ రత్ననాయకే(58)లు చితక్కొడుతూ పాక్ బౌలర్లను నీరుగార్చారు. ఫలింతగా గ్రూప్ బీ నుంచి న్యూజిలాండ్ సెమీస్‌కు దూసుకెళ్లింది. ఓదార్పు విజయంతో సల్మాన్ అఘా బృందం టోర్నీ నుంచి నిష్క్రమించింది. నాకౌట్ తొలి మ్యాచ్ వర్షార్పణం కావడం.. ఆపై ఇంగ్లండ్ చేతిలో ఓటమి.. పాకిస్థాన్ జట్టుసెమీస్ అవకాశాల్ని సంక్లిష్టం చేశాయి. ఇక ఇంటిదారి పట్టడం పక్కా అనుకున్న వేళ.. న్యూజిలాండ్ అనూహ్యంగా పరాజయం పాలవ్వడం పాక్‌కు కలిసొచ్చింది. శ్రీలంకపై భారీ తేడాతో గెలిస్తే సెమీస్ చేరడం ఖాయమనిపించింది.కానీ, 212 రన్స్ కొట్టినా పాకిస్థాన్ బంతితో మాత్రం శ్రీలంకను పడగొట్టలేకపోయింది. మైనస్ రన్ రేటులో ఉండడంతో లంకను 147లోపే కట్టడి చేస్తేనే పాక్ సెమీస్ దూసుకెళ్లే పరిస్థితి. ఆరంభంలోనే నసీం షా డేంజరస్ పథుమ్ నిశాంక వికెట్ తీసి బ్రేకిచ్చాడు. ఆ తర్వాత అబ్రార్ అహ్మద్ మూడు వికెట్లతో చెలరేగాడు. అంతే.. పాక్ ఆటగాళ్లు ముఖాల్లో ఆనందం విరిసింది. కానీ, పవన్ రత్ననాయకే(58), కెప్టెన్ దసున్ శనక(76)తో కీలక భాగస్వామ్యం నెలకొల్పి.. పాక్ ఆశలను గల్లంతు చేశాడు. లంక స్కోర్ 148 దాటడమే ఆలస్యం.. పాక్ ఇంటిదారి పట్టింది. గత మ్యాచ్‌లో ఇంగ్లండ్‌పై చివరిఓవర్ దాకా పోరాడి ఓడిన న్యూజిలాండ్ గ్రూప్ బీ నుంచి సెమీస్ బెర్తు ఖరారు చేసుకుంది. అఫ్రిది వేసిని చివరి ఓవర్లో 28 రన్స్ అవసరమవ్వగా.. 4, 6, 6, 6 బాదిన శనక లంకను గెలుపు వాకిట నిలిపాడు. కానీ, రెండు బంతులకు పరుగులేమీ రాకపోవడతో పాక్ 5 వికెట్లతో గెలుపొందింది.




# పోస్ట్‌మార్టం రిపోర్ట్ కోసం లంచం డిమాండ్ కీసరలో హోంగార్డ్ ఏసీబీ వలలో పట్టుబాటు

మన దునియా,మల్కాజిగిరి జిల్లా: ఫిబ్రవరి 28

మల్కాజిగిరి జిల్లాలోని కీసరలో లంచం వ్యవహారం వెలుగుచూసింది. పోస్టార్టం నివేదిక ఇప్పిస్తానని చెప్పి డబ్బులు డిమాండ్ చేసిన హోంగార్డ్ నగేష్‌ను అవినీతి నిరోధక శాఖ అధికారులు రంగంలోకి దిగి పట్టుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. తోటకూరు మహేశ్ నాలుగు నెలల క్రితం మృతి చెందాడు. కుటుంబ సభ్యులు పోస్టార్టం నివేదిక కోసం నగేష్‌ను సంప్రదించారు. ఈ క్రమంలో గాంధీ ఆస్పత్రిలో పరిచయం ఉన్న సందీప్ పేరును ప్రస్తావిస్తూ రిపోర్ట్ కావాలంటే రూ.2 లక్షలు ఇవ్వాలని నగేష్ డిమాండ్ చేసినట్లు



ఆరోపణలు ఉన్నాయి. చివరకు మృతుడి మేనల్లుడు శరత్‌తో చర్చించి రూ.40 వేలకే ఒప్పందం కుదుర్చుకున్నాడు. దీంతో బాధితులు ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. అధికారులు పన్నిన ఉచ్చులో భాగంగా మొదట రూ.5 వేలు తీసుకున్న నగేష్, రెండో విడతగా రూ.35 వేలు స్వీకరిస్తుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. పట్టుకున్న డబ్బులను స్వాధీనం చేసుకున్న అధికారులు, నగేష్‌పై కేసు నమోదు చేసి తదుపరి చర్యలు ప్రారంభించారు. ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది.

# ప్రపంచకప్ నుంచి పాకిస్థాన్ ఔట్.. సెమీస్‌కు దూసుకెళ్లిన న్యూజిలాండ్..!




పొట్టి ప్రపంచకప్ నుంచి పాకిస్థాన్ నిష్క్రమించింది. సెమీఫైనల్ బెర్తుపై కన్నేసిన పాక్ భారీ తేడాతో శ్రీలంకను ఓడించలేకపోయింది. ఓపెనర్ ఫర్హాన్(100) సెంచరీతో పల్లెకెలె స్టేడియంలోభారీ స్కోర్ చేసినా.. బౌలర్లు శ్రీలంకను 147లోపు కట్టడి చేయలేకపోయారు. స్పిన్నర్లు చెలరేగినా.. పవన్ రత్ననాయకే(58) అర్ధశతకంతో విరుచుకుపడి పాక్ ఆశలపై నీళు చల్లాడు. నాకౌట్ తొలి మ్యాచ్ వర్షార్పణం కావడం.. ఆపై ఇంగ్లండ్ చేతిలో ఓటమి.. పాకిస్థాన్ జట్టుసెమీస్ అవకాశాల్ని సంక్లిష్టం చేశాయి. ఇక ఇంటిదారి పట్టడం పక్కా అనుకున్న వేళ.. న్యూజిలాండ్ అనూహ్యంగా పరాజయం పాలవ్వడం పాక్‌కు కలిసొచ్చింది. శ్రీలంకపై భారీ తేడాతో గెలిస్తే సెమీస్ చేరడం ఖాయమనిపించింది. కానీ, 212 రన్స్ కొట్టినా పాకిస్థాన్ బంతితో మాత్రం శ్రీలంకను పడగొట్టలేకపోయింది. మైనస్ రన్ రేటులో ఉండడంతో లంకను 147లోపే కట్టడి చేస్తేనే పాక్ సెమీస్ దూసుకెళ్లే పరిస్థితి. ఆరంభంలోనే నసీం షా డేంజరస్ పథుమ్ నిశాంక వికెట్ తీసి బ్రేకిచ్చాడు. ఆ తర్వాత అబ్రార్ అహ్మద్ మూడు వికెట్లతో చెలరేగాడు. అంతే.. పాక్ ఆటగాళ్లు ముఖాల్లో ఆనందం విరిసింది. కానీ, పవన్ రత్ననాయకే(58), కెప్టెన్ దసున్ శనకతో కీలక భాగస్వామ్యం నెలకొల్పి.. పాక్ ఆశలను గల్లంతు చేశాడు. లంక స్కోర్ 148 దాటడమే ఆలస్యం.. పాక్ ఇంటిదారి పట్టింది.

# చరిత్ర సృష్టించిన జమ్మూకశ్మీర్.. తొలిసారి రంజీ ట్రోఫీ కైవసం

హుబ్లీ: జమ్మూకశ్మీర్ క్రికెట్ జట్టు చరిత్ర సృష్టించింది. రంజీ ట్రోఫీని మొట్ట మొదటి సారి గెలుచుకున్నది. కర్నాటకతో హుబ్లీలో జరిగిన ఫైనల్ మ్యాచ్ డ్రాగా ముగిసింది. దీంతో ఫస్ట్ ఇన్నింగ్స్‌లో భారీ ఆధిక్యాన్ని సాధించిన జమ్మూకశ్మీర్ జట్టుకు రంజీ ట్రోఫీ దక్కింది. ఇవాళ అయిదో రోజు జమ్మూకశ్మీర్ బ్యాటర్లు కర్నాటక బౌలర్లను ధీటుగా ఎదుర్కొన్నారు. జేకే బ్యాటర్లు కమ్రాన్ ఇక్బాల్, సాహిల్ లోత్రాలు..



కర్నాటక బౌలర్లను ఆటాడుకున్నారు. ఆ ఇద్దరూ అయిదో వికెట్ అజేయంగా 197 రన్స్ జోడించారు. కమ్రాన్ ఇక్బాల్ 160 , సాహిల్ లోత్రా 101 రన్స్ చేసి క్రీజ్‌లో ఉన్నారు. రెండో ఇన్సింగ్‌లో ఇవాళ జమ్మూకశ్మీర్ జట్టు 4 వికెట్లు కోల్పోయి 342 రన్స్ చేసిన సమయంలో ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసింది. జేకే జట్టు మొత్తం 633 పరుగుల ఆధిక్యాన్ని సాధించింది. అయితే కర్నాటక, జమ్మూకశ్మీర్ కెప్టెన్లు డ్రాకు అంగీకరించడంతో.. రంజీ ట్రోఫీ జేకే జట్టును వరించింది.

మన దునియా
మన అక్షరం - మన ప్రపంచం



## నూతన దంపతులకు కానుక... 'రణబాలి'లోని 'ఎందయ్య సామి' పాట విడుదల

విజయ్ దేవరకొండ, రష్మికలకు 'రణబాలి' చిత్రబృందం స్పెషల్ సర్‌ప్రైజ్

సినిమా నుంచి 'ఎందయ్య సామి' రొమాంటిక్ మెలోడీ విడుదల

అజయ్-అతుల్ సంగీతం.. ఐదు భాషల్లో వచ్చిన పాట

సెప్టెంబర్ 11న ప్రపంచవ్యాప్తంగా సినిమా విడుదల

టాలీవుడ్ స్టార్ జంట విజయ్ దేవరకొండ, రష్మిక మందన్నలకు వారి కొత్త సినిమా టీమ్ నుంచి ఓ స్పెషల్ సర్‌ప్రైజ్ అందింది. ఇటీవలే వివాహ బంధంతో ఒక్కటైన ఈ జంటకు కానుకగా, వారు నటిస్తున్న 'రణబాలి' చిత్రం నుంచి ఓ రొమాంటిక్ మెలోడీ సాంగ్‌ను చిత్రబృందం విడుదల చేసింది. "ఎందయ్య సామి" అంటూ సాగే ఈ పాటను శనివారం రిలీజ్ చేశారు.రాహుల్ సంకృత్యన్ దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్ ఈ చిత్రాన్ని ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తోంది. ఇందులో విజయ్ 'రణబాలి' అనే పవర్‌ఫుల్ పాత్రలో, రష్మిక 'జయమ్మ'గా కనిపించనున్నారు. తాజాగా విడుదలైన "ఎందయ్య సామి" పాటకు ప్రముఖ సంగీత ద్వయం అజయ్-అతుల్ స్వరాలు సమకూర్చారు. ఈ పాటలో విజయ్, రష్మికల మధ్య కెమిస్ట్రీ అద్భుతంగా పండిందని, వారిద్దరినీ చూస్తుంటే 'గీత గోవిందం' రోజులు గుర్తుకొస్తున్నాయని అభిమానులు సోషల్ మీడియాలో కామెంట్స్ చేస్తున్నారు. ఈ మెలోడీని తెలుగుతో పాటు తమిళ, హిందీ, కన్నడ, మలయాళం భాషల్లో ఏకకాలంలో విడుదల చేశారు. ఇదిలా ఉంటే, ఈ సినిమాలో 'ది మమ్మీ' ఫేమ్, హాలీవుడ్ నటుడు ఆర్నాల్డ్ వోస్లూ ఒక కీలక పాత్ర పోషిస్తుండటం విశేషం. ఈ చిత్రాన్ని సెప్టెంబర్ 11న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేయనున్నట్లు నిర్మాతలు ప్రకటించారు.

## శ్రీవారి సన్నిధిలో అడివి శేష్, మృణాల్ ఠాకూర్.. కొత్త సినిమా కోసం పూజలు

యంగ్ హీరో అడివి శేష్, నటి మృణాల్ ఠాకూర్ జంటగా నటిస్తున్న పాన్-ఇండియా చిత్రం 'డకాయిట్'. ఈ సినిమా ప్రమోషన్లను చిత్రబృందం ఆధ్యాత్మికంగా ప్రారంభించింది. ఇందులో భాగంగా అడివి శేష్, మృణాల్ ఠాకూర్ శనివారం తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. సంప్రదాయ వస్త్రధారణలో ఆలయానికి వచ్చిన ఈ జంట, తమ సినిమా విజయవంతం కావాలని స్వామివారి ఆశీస్సులు తీసుకున్నారు.ఈ సందర్భంగా అడివి శేష్ మాట్లాడుతూ... "ప్రతి సినిమా ఒక నమ్మకంతో చేసే ప్రయత్నమే. ఏళ్ల తరబడి కష్టపడి ఒక సినిమాను ప్రేక్షకుల చేతిలో పెడతాం. తిరుపతిలో ఈ ప్రయాణాన్ని ప్రారంభించడం సరైనదిగా అనిపించింది. ప్రమోషన్ల హడావుడిలోకి అడుగుపెట్టే ముందు కృతజ్ఞతతో ఆశీస్సులు తీసుకోవడం మాకు ముఖ్యం" అని తెలిపారు. అంతకుముందు తన మరో సినిమా విడుదల సందర్భంగా వరంగల్‌లోని భద్రకాళి అమ్మవారిని కూడా శేష్ దర్శించుకున్నారు.ఇటీవలే 'డకాయిట్' చిత్రం నుంచి 'రూబరూ' అనే రొమాంటిక్ పాటను విడుదల చేశారు. ఈ పాట గురించి శేష్ మాట్లాడుతూ... "సినిమాలోని భావోద్వేగాలను, పాత్రల మధ్య ఉన్న సున్నితమైన సంబంధాన్ని 'రూబరూ' పాట ఆవిష్కరిస్తుంది. అందుకే ఈ పాటతో ప్రమోషన్లు ప్రారంభించాం. ఈ చిత్రాన్ని ఏప్రిల్‌లో ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను" అని వివరించారు.'డకాయిట్' చిత్రానికి షానియేల్ డియో దర్శకత్వం వహిస్తున్నారు. ఇందులో బాలీవుడ్ ప్రముఖ దర్శకుడు అనురాగ్ కశ్యప్ కీలకమైన ప్రతినాయకుడి పాత్రలో నటిస్తుండగా, ప్రకాశ్ రాజ్, సునీల్, అతుల్ కులకర్ణి, జైన్ మేరీ ఖాన్, కామాక్షి భాస్కర్ల ఇతర ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. తనను మోసం చేసిన మాజీ ప్రియురాలిపై ప్రతీకారం తీర్చుకోవాలనుకునే ఒక ఖైదీ కథే ఈ చిత్రం. ప్రేమ, ద్రోహం, పగ వంటి అంశాలతో ఈ సినిమా ఎమోషనల్ థ్రిల్లర్‌గా తెరకెక్కుతోంది. తెలుగు, హిందీ భాషల్లో ఏకకాలంలో చిత్రీకరించిన ఈ చిత్రానికి అడివి శేష్, షానియేల్ డియో కలిసి కథ, స్క్రీన్‌ప్లే అందించారు. ప్రస్తుతం పోస్ట్-ప్రొడక్షన్ పనులు జరుపుకుంటున్న ఈ సినిమా, త్వరలో పాన్-ఇండియా స్థాయిలో గ్రాండ్‌గా విడుదల కానుంది.





# సోషల్ మీడియాలో 'విరోష్' సునామీ.. పెళ్లి ఫొటోలతో రికార్డులన్నీ బద్దలు!

టాలీవుడ్ స్టార్ జంట విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న తమ పెళ్లి ఫొటోలతో సోషల్ మీడియాలో సరికొత్త చరిత్ర సృష్టించారు. ఈ నెల 26న ఉదయ్‌పూర్‌లో అంగరంగ వైభవంగా ఒక్కటైన ఈ జంట, తమ వివాహ చిత్రాలను ఇన్‌స్టాగ్రామ్‌లో పంచుకోగా లైకుల వర్షం కురుస్తోంది. ఈ పోస్ట్ కేవలం 24 గంటల్లోనే భారతీయ సెలబ్రిటీల పెళ్లిళ్ల రికార్డులన్నింటినీ తిరగరాసి, సోషల్ మీడియాలో వారికున్న అసాధారణమైన క్రేజ్‌ను మరోసారి నిరూపించింది.ఇప్పటివరకు బాలీవుడ్ జంట కియారా అద్వానీ-సిద్ధార్థ్ మల్హోత్రా పెళ్లి ఫొటోలకు వచ్చిన 16 మిలియన్ల లైక్సే అత్యధిక రికార్డుగా ఉండేది. అయితే, 'విరోష్' (విజయ్-రష్మిక) జంట ఈ మైలురాయిని కేవలం 14 గంటల్లోనే దాటేసి సంచలనం సృష్టించింది. ప్రస్తుతం వీరి పోస్ట్ 23.3 మిలియన్ల లైక్స్‌తో దూసుకుపోతోంది. దీంతో అలియా భట్-రణబీర్ కపూర్ (13 మిలియన్+), సమంత-నాగ చైతన్య (12 మిలియన్+), కత్రినా కైఫ్-విక్కీ కౌశల్ (10 మిలియన్+), దీపికా పదుకొనే-రణవీర్ సింగ్ (8 మిలియన్+) వంటి స్టార్ కపుల్స్ రికార్డులను ఈ జంట అధిగమించింది. ఈ ట్రెండ్ ఇలాగే కొనసాగితే విరాట్ కోహ్లీ వ్యక్తిగత పోస్ట్ రికార్డుకు కూడా చేరువయ్యే అవకాశం కనిపిస్తోంది.దాదాపు ఎనిమిదేళ్ల రహస్య ప్రేమ ప్రయాణానికి ముగింపు పలుకుతూ ఒక్కటైన ఈ జంటకు అభిమానులు, సినీ ప్రముఖుల నుంచి శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి. "నా బెస్ట్ ఫ్రెండ్‌ను భార్యగా చేసుకున్నాను" అని విజయ్, "నాకు నిజమైన ప్రేమను పరిచయం చేసిన వ్యక్తి" అని రష్మిక పెట్టిన ఎమోషనల్ క్యాప్షన్లు నెటిజన్లను మరింతగా ఆకట్టుకున్నాయి. వీరి పెళ్లి ఫొటోలు టాలీవుడ్‌లోనే కాకుండా దేశవ్యాప్తంగా ట్రెండ్ అవుతున్నాయి. ఉదయ్‌పూర్ వేడుకల అనంతరం మార్చి 4న హైదరాబాద్‌లో జరగనున్న గ్రాండ్ వెడ్డింగ్ రిసెప్షన్‌కు సినీ, రాజకీయ రంగాలకు చెందిన ప్రముఖులు భారీ సంఖ్యలో హాజరుకానున్నట్లు తెలుస్తోంది.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY AAKULA SUDHAKAR, PUSHPALATHA PUBLICATIONS AND PRINTING, HNo: 1-83, B.C.Colony, BOLLONIPALLY ARSHANPALLY, NALLA-BELLY MANDALAM, WARANGAL DIST - 506349, TELANGANA STATE, PUBLISHED PUSHPALATHA PUBLICATIONS HNo. 1-83, B.C.Colony, BOLLONIPALLY ARSHANPALLY, NALLABELLY MANDALAM, WARANGAL DIST- 506349.TELANGANA STATE,TITEL-code : RNI NUMBER ; TELTEL-2023/85680, Cel1 No: 9603969335, MANADUNIA 2022 @ gmail.com